సత్యసాయి సేవలకు సాటి లేదు

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్

మానవతా దీప్తి సత్యసాయి

ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు

ముగిసిన సేవాదళ్ అంతర్జాతీయ సదస్సు

భక్తులతో కిటకిటలాడిన ప్రశాంతి నిలయం



మాట్లాడుతున్న మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్

సాయిప్రేమ విశ్వవ్యాప్తం



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి బాబా మహాసమాధి

పుట్టపర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవలకు సాటి లేదని, ఆయన ప్రేమతత్వం విశ్వవ్యాప్తమని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కొనియాడారు. పుట్టపర్తిలో జరుగుతున్న సత్యసాయి శత జయంతి వేడుకలలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతులో సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీసత్యసాయి అంతర్జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సత్యసాయి బోధించిన 'అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు' అనే నినాదాన్ని ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఆచరిస్తున్నారని అన్నారు. సత్యసాయి ప్రేమ, సేవ, ఆధ్యాత్మికత భక్తులకు జీవన ప్రమాణంగా మారిందని అన్నారు. సత్యసాయి మానవతా దీప్తి అని, నిస్వార్థ సేవలకు ప్రతిరూపమని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు కొనియాడారు. సత్యసాయి ప్రేమతత్వాన్ని ఆచరిస్తే ప్రతి వ్యక్తి జీవితం శాంతిమయంగా సాగుతుందని అన్నారు. సత్యసాయి మానవ రూపంలో ఉన్న ప్రేమ, సేవ, ఆధ్యాత్మిక దైవమని రాజ్యసభ సభ్యుడు అశోక్‌చవాన్ కొనియాడారు. తాను 55 సంవత్సరాలుగా ప్రశాంతి నిలయానికి వస్తున్నానని, ప్రశాంతి నిలయంలో సత్యసాయి దర్శనంతో (మిగతా 6వ పేజీలో..)





నేడు పుట్టపర్తికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి

- సత్యసాయి శత జయంతి వేడుకలకు హాజరు
- స్వాగతం పలకనున్న సీఎం చంద్రబాబు
- నేడు మంత్రి నారా లోకేశ్ రాక
- భద్రతను కట్టుదిట్టం చేసిన పోలీసు యంత్రాంగం

పుట్టపర్తి టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి వేడుకలకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ శనివారం హాజరు అవుతున్నారు. ప్రశాంతి నిలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ జరిగే వేడుకలలో రాష్ట్రపతి పాల్గొంటారు. సాయంత్రం జరిగే సత్యసాయి వర్సిటీ స్నాతకోత్సవంతో ఉపరాష్ట్రపతి పాల్గొంటారు. మరుసటి రోజు ఆదివారం జరిగే సత్యసాయి జయంతి ఉత్సవాలలోనూ ఉపరాష్ట్రపతి పాల్గొంటారు. సీఎం చంద్రబాబు శని, ఆదివారాలు రెండు (మిగతా 6లో..)



బాబా మహాసమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచుతున్న మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్



కేరళ లబ్దిదారులకు ఉచితంగా ఆటోలు పంపిణీ చేస్తున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి, ఒడిశా గవర్నర్, ఆర్‌జే రత్నాకర్, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తదితరులు



గానామృతం..



భక్తుల హారతి...

నేడు సత్యసాయి వర్సిటీ
స్నాతకోత్సవం

- ముఖ్య అతిథి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

శ్రీసత్యసాయి యూనివర్సిటీ 44వ స్నాతకోత్సవం పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో శనివారం జరగనుంది. చాన్సలర్ చక్రవర్తి అధ్యక్షతన జరిగే ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరవుతున్నారు

(వివరాలు మెయిన్‌లో)

అలరించిన నృత్య ప్రదర్శనలు

పుట్టపర్తి టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా శుక్రవారం రాత్రి స్థానిక శిల్పారామంలో అఖిల భారత డ్వాక్రా బజార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. స్కూల్ ఆఫ్ కూచిపూడి బెంగళూరు శ్వేత ప్రసన్న బృందం భరతనాట్యం ప్రదర్శించింది. పెనుకొండ హైందవి డాన్స్ అకాడమీ రమేష్ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం, పాటలు ప్రజలను ఆకట్టుకున్నాయి.



శిల్పారామంలో నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

విద్యార్థులకు సాయి భక్తుల సైకిళ్ల పంపిణీ



బుక్కపట్నం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దేశవిదేశాల్లో సేవాకార్యక్రమాలు కొనసాగించిన మహోన్నత వ్యక్తి సత్యసాయిబాబా అని సింగపూర్‌కు చెందిన సత్యసాయి భక్తులు పేర్కొన్నారు. మండలంలోని కృష్ణాపురం గ్రామం జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం వారు 50 మంది విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. 200 వాటర్ క్యాన్లు, లంచ్ బాక్సులు అందజేశారు. ఉచిత వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యసాయి భక్తులు మాట్లాడుతూ సత్యసాయి సేవా స్ఫూర్తితో తమ వంతుగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సింగపూర్‌కు చెందిన సత్యసాయి భక్తులు, ప్రధానోపాధ్యాయుడు బాలాజి, గ్రామస్థులు అప్పస్వామి, జగదీష్ స్వామి, యాదాలంకపల్లి హరి, లక్ష్మీనారాయణ, రెడ్డెప్ప, సుబ్బరాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భయపడొద్దు తల్లీ.. నీవే వస్తావ్ !



వైష్ణవి, తల్లిదండ్రులు శేషాద్రినాయుడు, లక్ష్మీగాయత్రి

ట్విట్టర్‌లో బాలికకు మంత్రి లోకేశ్ అభయం

నంబులపూలకుంట, నవంబరు21 (ఆంధ్రజ్యోతి) : 'ఏం భయపడొద్దు తల్లీ ..! నీవే మాక్ అసెంబ్లీకి వస్తావ్' అని విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ అభయం ఇవ్వడంతో ఆ విద్యార్థి ఊరట చెందింది. కదిరి నియోజవర్గం నుంచి మాక్ అసెంబ్లీకి తాను ఎంపికైతే తన పేరు జాబితాలో లేదని ఆవేదన చెందిన విద్యార్థి తల్లిదండ్రుల సహకారంతో ట్విట్టర్‌లో మంత్రి లోకేశ్‌కు శుక్రవారం ఫిర్యాదు చేసింది. మంత్రి స్పందించి, భరోసా ఇవ్వడంతో విద్యార్థి, ఆమె తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

మారిన పేరు.. తల్లిదండ్రుల ఆందోళన

మాక్ అసెంబ్లీకి విద్యార్థుల ఎంపికలో పేర్లు తారుమారయ్యాయి. నియోజకవర్గానికి ఒకరిని చొప్పున ఎంపిక చేయడానికి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కదిరి నియోజకవర్గానికి సంబంధించి నంబులపూలకుంట జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి వైష్ణవి మొదటి స్థానం సాధించినట్లు గత నెల 30న కదిరిలో ఎంఈఓల సమక్షంలో ప్రకటించారు. అయితే శుక్రవారం ప్రకటించిన జిల్లా జాబితా వైష్ణవి పేరు కనిపించలేదు. మండలంలోని గూటిబైలు జడ్పీ హైస్కూల్‌లో 9వతరగతి చదువుతున్న లిఖిత్‌రెడ్డి(రెండవస్థానం)పేరు ప్రకటించారు. దీనిపై వైష్ణవి తల్లిదండ్రులు శేషాద్రినాయుడు, లక్ష్మీగాయత్రి ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమార్తె నియోజకవర్గ స్థాయిలో రాతపరీక్ష, క్విజ్, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి 18మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారన్నారు. వీరిలో వైష్ణవి, లిఖిత్ రెడ్డి, చైతన్యకుమార్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు చెప్పారు. దీంతో ప్రథమ స్థానంలో నిలిచి మాక్ అసెంబ్లీకి ఎంపికైన వైష్ణవికి కదిరిలో ఎంఇఓల సమక్షంలో సన్మానం చేశారన్నారు. మాక్ అసెంబ్లీకి ఎంపికైనట్లు తాడేపల్లి నుంచి కూడా తమకు ఫోన్ వచ్చిందన్నారు. అయితే హఠాత్తుగా జాబితాలో వైష్ణవి పేరు రాకుండా లిఖిత్‌రెడ్డి పేరు రావడం ఏమిటని ప్రశ్నించారు.



బాలికలు ఎక్కువగా ఉండటం వల్లే..

ఈవిషయంపై ఎంఈఓ గోపాల్‌నాయక్‌ను అడగగా, జిల్లా అధికారులను అడిగి తెలుసుకుంటామన్నారు. హెచ్ఎం మోహన్‌రెడ్డిని అడుగగా వైష్ణవి ఎంపిక కావడంతో తమ పాఠశాలకు గుర్తింపు వస్తుందనుకున్నాం. జాబితలో తమ విద్యార్థిని పేరు లేకపోవడం బాధించిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కందికంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా, మీకే న్యాయం జరుగుతుందని చెప్పినట్లు బాలిక తల్లిదండ్రులు తెలిపారు. ఈవిషయంపై డీఈఓ క్రిష్టప్పను 'ఆంధ్రజ్యోతి' అడుగగా, జాబితాను రాజధానికి పంపాం. ఎంపికలో బాలికలు ఎక్కువగా ఉండటంతో ఇలాంటి మార్పులు చేశారన్నారు.

మాక్ అసెంబ్లీకి ఆరుగురు



మాక్ అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థులతో డీఈఓ

కొత్తచెరువు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మాక్ అసెంబ్లీకి జిల్లా నుంచి నియోజకవర్గానికి ఒకరు చొప్పున ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని డీఈఓ క్రిష్టప్ప శుక్రవారం తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గం నుంచి కొత్తచెరువు మండలం తలమర్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి జి.నిషిత, ధర్మవరం మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి జశ్వంత్, కదిరి నియోజకవర్గం నుంచి ఎన్‌పీకుంట మండలం గూటిబైలు జడ్పీ ఉన్నతపాఠశాలకు చెందిన ఎం.లిఖిత్‌రెడ్డి, పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండలం కోగిర జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కె.జయవర్ధన్, హిందూపురం నియోజకవర్గం లేపాక్షి మండలం పులమతి జడ్పీ ఉన్నతపాఠశాలకు చెందిన పి.మేఘన, మడకశిర నియోజకవర్గం గుడిబండ మండలం ఎస్.రాయాపురం జడ్పీ ఉన్నతపాఠశాలకు చెందిన పి.సంధ్య ఎంపికైనట్లు డీఈఓ తెలిపారు. ఈ విద్యార్థులు ఈ నెల 23న విజయవాడకు వెళ్తారని, 24, 25 తేదీలలో విద్యార్థులకు అసెంబ్లీలో వ్యవహరించే విధానంపై శిక్షణ ఇస్తారని తెలిపారు.

దారులు శిథిలం

- వర్షాలకు తేలిన కంకర
- ప్రమాదకరంగా గుంతలు
- బాగు చేయాలని ప్రజల వినతి

గుంతలు పడిన చెరువు వాండ్లపల్లి రోడ్డు



(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి. వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రభావం ఇప్పటికీ కనిపిస్తోంది. అప్పట్లో అత్యంత దారుణంగా తయారైన రోడ్లను టీడీపీ కూటమి ప్రభుత్వం కొంతవరకూ బాగు చేయించింది. ఎక్కడికక్కడ మరమ్మతు పనులు చేయించింది. కానీ వర్షాల కారణంగా మళ్లీ గుంతలు పడ్డాయి. ప్యాచ్ వర్కులు చేసిన ప్రాంతంలో కాకుండా ఇతర చోట్ల దెబ్బతింటున్నాయని అధికారులు అంటున్నారు. ప్రభుత్వం తగినన్ని నిధులను మంజూరు చేసి, రహదారులు బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

- నల్లచెరువు మండలం ఓరువాయి పంచాయతీలోని చెరువువాండ్లపల్లి రహదారి గుంతలతో అధ్వానంగా తయారైంది. దారిలో అడుగడుగునా గుంతలు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దెబ్బతిన్న గాయిత్రి కాలనీ రోడ్డు





ఓడీసీలో దెబ్బతిన్న కదిరి-హిందూపురం ప్రధాన రహదారి

- ఓబుళదేవరచెరువు మండలంలో నల్లగుట్లపల్లి రహదారి, కదిరి-హిందూపురం ప్రధాన రహదారి కంకర తేలి, గుంతలు పడ్డాయి. నల్లగుట్లపల్లి రహదారిని పదేళ్ల క్రితం వేశారు. ఈ దారి ప్రమాదకరంగా మారింది. ఉగ్గిరెడ్డిపల్లి రహదారి కూడా గుంతలమయమైంది.
- గుడిబండ మండలం ఎస్.రాయాపురం నుంచి మండలపల్లికి వెళ్లే రోడ్డు వర్షాలకు దెబ్బతింది. గుంతలు పడినా మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ద్విచక్రవాహనదారులు తరుచూ ప్రమాదాలబారిన పడుతున్నారు.
- అగళి మండలం ఇరిగేపల్లి నుంచి గాయత్రి కాలనీకి వెళ్లే దారి అధ్వానంగా మారింది. స్వల్పంగా దెబ్బతిన్నప్పుడే మరమ్మతులు చేపట్టివుంటే పరిస్థితి ఇలా ఉండేది కాదని స్థానికులు అంటున్నారు.



గుంతలమయమైన ఎస్.రాయాపురం - మండలపల్లి రోడ్డు

తరచూ ప్రమాదాలు



మండలపల్లి దారిలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. వర్షాలు పడిన సమయంలో రోడ్లు మరింత దెబ్బతింటున్నాయి. బైక్‌పై వెళ్లినవారు ప్రమాదాలకు గురవుతున్నారు. మరమ్మతులు చేపట్టాలని వైసీపీ హయాంలో పలుమార్లు కోరినా పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వమైనా రోడ్డును బాగు చేయాలి.

- హనుమంతరాయప్ప, మండలపల్లి

సాయిప్రేమ విశ్వవ్యాప్తం

(5వ పేజీ తరువాయి)

తన జీవితంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయని అన్నారు. సత్యసాయితో ఉన్న అనుబంధం జీవితాంతం తన వెంట ఉంటుందని అన్నారు. సత్యసాయి ప్రేమ, సేవా మార్గం తమకు శిరోధార్యమని, వాటిని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు డాక్టర్ మోహన్ అన్నారు. సత్యసాయి ప్రేమతత్వం, సేవలతో సేవాదళ్ సభ్యులు తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకుంటున్నారని సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్ పాండే అన్నారు. మహిమను కరుణను గుర్తించినప్పుడే నిజమైన భక్తి పుడుతుందని సరితా అయ్యర్ అన్నారు. పరిపూర్ణ సమర్పన, నిర్మలమైన చరణాగతితో మనం ఏ కార్యక్రమం చేసినా భగవంతుడు మన వెంటే ఉంటారని అన్నారు.

ప్రశాంతి నిలయంలో సందడి

సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు వచ్చి భక్తులతో ప్రశాంతి నిలయం సందడిగా మారింది. సాయికుల్వంతు మందిరం భక్తులతో కిటకిటలాడింది. వేలాది మంది సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. అంతర్జాతీయ సదస్సుకు వివిధ దేశాల నుంచి 2500 మంది సేవాదళ్ ప్రతినిధులు హాజరయ్యారు. ప్రశాంతి నిలయంలో సత్యసాయి యువత సంగీత, గాన కచేరీతో భక్తులను అలరించింది. వేడుకలకు హాజరైన భక్తులకు ట్రస్టు ఆధ్వర్యంలో నారాయణ సేవను అందించారు. ప్రశాంతి నిలయం వెస్ట్‌గేట్, ఎనుములపల్లి గణేశ్ సర్కిల్ గేటు సమీపంలో భక్తులకు మూడు పూటలా నారాయణ సేవను అందిస్తున్నారు. వేడుకలకు రాజ్యసభ సభ్యుడు భగవత్ ఖరాడ్, సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సభ్యులు చక్రవర్తి, ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రులు గీతారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి తదితరులు హాజరయ్యారు.



మహాసమాధి వద్ద ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



సదస్సుకు హాజరైన మహిళలు



అంతర్జాతీయ సదస్సులో వివిధ దేశాల సేవాదళ్ ప్రతినిధులు

సత్యసాయి ప్రేమతత్వ ప్రచారమే ఆశయం

● సేవా సంస్థల జాతీయ కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు



ప్రసంగిస్తున్న కోటేశ్వరరావు

పుట్టపర్తి: ప్రేమ, సేవ, బోధనలతో సత్యసాయి ప్రపంచానికి ఆధ్యాత్మిక గురువుగా పూజలందుకుంటున్నారని సత్యసాయి సేవా సంస్థల జాతీయ కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు అన్నారు. సత్యసాయి ప్రేమ తత్వాన్ని ప్రచారం చేయడమే తమ జీవితాశయమని అన్నారు. సాయి కుల్వంతు హాలులో శుక్రవారం రాత్రి జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. సత్యసాయి బాబా 1962, నవంబరు 24 న మొదటి సారి ప్రపంచ సదస్సును ప్రారంభించారని గుర్తు చేశారు. నాటి నుంచి సదస్సులను కొనసాగిస్తున్నామని తెలిపారు. సత్యసాయి భక్తులు నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలని, త్రికరణ శుద్ధితో సేవ చేయాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు ప్రేమను చేరవేయడంలో పదేళ్లలో ఎంతో ముందుకు వెళ్లామని అన్నారు. భవిష్యత్తులో బాలవికాస్ విద్యను అభివృద్ధి చేయాలని, గురువులకు శిక్షణ ఇవ్వాలని, మహిళా సదస్సులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం మహారాష్ట్రకు చెందిన రాహుల్ దేశ్ పాండే బృందం సంగీత, గాన కచేరీ నిర్వహించింది.

వంద మందికి ఆటోలు

కేరళ సేవా సంస్థలు 'శ్రీసత్యసాయి జీవనోపాధి' పేరిట వంద మందికి ఆటో రిక్షాలను సమకూర్చాయి. వీటిని లబ్ధిదారులకు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ శుక్రవారం అందజేశారు.



సంగీత కచేరీ నిర్వహిస్తున్న రాహుల్ దేశ్ పాండే బృందం



ఆటోలు అందుకున్న కేరళ లబ్ధిదారులతో ట్రస్టు సభ్యులు

ప్రేమ జ్యోతి పుస్తకావిష్కరణ

శ్రీసత్యసాయి ప్రేమ జ్యోతి పుస్తకాన్ని 11వ అంతర్జాతీయ సదస్సు ముగింపు సందర్భంగా శుక్రవారం రాత్రి సాయి కుల్వంతు మందిరంలో ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి సదస్సును ముగించారు. సత్యసాయి ప్రేమ తత్వాన్ని మరింత విశ్వవ్యాప్తం చేయాలని, సేవాదళ్‌లో మహిళ విభాగాన్ని మరింతి బలోపేతం చేయాలి తీర్మానించారు.



ప్రేమజ్యోతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ట్రస్టు, సేవాదళ్ ప్రతినిధులు

నేడు పుట్టపర్తికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి






పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, వేదికపై డీఐజీ షిమోషి, బందోబస్తు నిమిత్తం పుట్టపర్తికి వచ్చిన పోలీసు అధికారులు

(5వ పేజీ తరువాయి)

రోజులపాటు పుట్టపర్తిలో ఉండి, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతితో కలిసి వేడుకలలో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో భద్రతపై డీఐజీ షిమోషి, ఎస్పీ సతీష్ కుమార్ సమీక్ష నిర్వహించారు. ఆయా సెక్టార్ ఇన్‌చార్జిలకు దిశానిర్దేశం చేశారు. సత్యసాయి విమానాశ్రయం, కాన్వాయ్ వెళ్లే రోడ్డు మార్గం, పార్కింగ్ ప్రదేశాలు, రూట్ డైవర్సన్స్ గురించి సూచనలు చేశారు.

నేడు మంత్రి నారా లోకేశ్ రాక

ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ శనివారం పుట్టపర్తి వస్తున్నారు. ఉండవల్లిలోని తన నివాసం హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 9.45 గంటలకు ఆయన పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సీఎం చంద్రబాబుతో కలిసి స్వాగతం పలుకుతారు. అనంతరం ప్రశాంతి నిలయం చేరుకుని, వేడుకలలో పాల్గొంటారు. మ ధ్యాహ్నం రాష్ట్రపతికి వీడ్కోలు పలుకుతారు. పుట్టపర్తి విమానాశ్రయంలో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు సాయంత్రం 3.30 గంటలకు స్వాగతం పలుకుతారు. ఆయనతోకలిసి సత్యసాయి వర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. కప్పలబండ పారిశ్రామికవాడలో ఏర్పాటు చేసిన ప్రత్యేక టెంట్ హౌస్‌లో శనివారం రాత్రి బస చేస్తారు. సత్యసాయి శతజయంతి వేడుకల్లో ఆదివారం పాల్గొంటారు. గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద గల నాసిన్ క్యాంపులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మధ్యాహ్నం పాల్గొంటారు. అనంతరం పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుని హైదరాబాద్ వెళ్తారు.



వంద కిలోల కేక్‌తో ట్రస్టు ప్రతినిధులు, మంత్రి కందుల దుర్గేష్

మహనీయుడు సత్యసాయి

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్

ప్రశాంతి నిలయంలో వంద కిలోల కేక్ కట్ చేసిన మంత్రి

పుట్టపర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవకు, మానవ సంక్షేమానికి ఆధ్యాత్మికతను సాధనంగా మలిచిన మహనీయుడు సత్యసాయి బాబా అని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కొనియాడారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో సెంట్రల్ ట్రస్ట్ నిర్వాహకులతో కలిసి వంద కిలోల సత్యసాయి బాబా పుట్టిన రోజు కేకును మంత్రి శుక్రవారం కట్ చేశారు. సత్యసాయి ఆశీస్సులు అందరిపై ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సభ్యులు నాగానందం, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యానికి పద్యమే మూలం

● ఇంటాక్ కన్వీనర్ రామ్‌కుమార్

అనంతపురం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యానికి పద్యమే మూలమని ఇంటాక్ అనంతపురం జిల్లా కన్వీనర్ రామ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు పురావస్తు ప్రదర్శనశాలలో వివిధ పాఠశాలల విద్యార్థులకు పద్యపఠన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పురాణ ఇతిహాసాల నుంచి నేర్చుకున్న పద్యాలు, చందస్సు, యతి, ప్రాసతో కూడిన పద్యాలు, సాహితీ పద్యాలు, వేమన పద్యాలు, సుభాషితాలు పఠించారు. అనంతరం పురావస్తుశాఖ ఏడీ స్వామినాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రామ్‌కుమార్ మాట్లాడుతూ పద్యంతో భావ వ్యక్తీకరణ చేయడం ద్వారా భాషా సామర్థ్యం పెరుగుతుందన్నారు. వారసత్వమంటే కేవలం కట్టడాలు మాత్రమే కాదని, భాష కూడా అని పేర్కొన్నారు. భాష ఒక సజీవ నదీ ప్రవాహంలాంటిదన్నారు. ఒక తరం నుంచి మరో తరానికి వారసత్వంలాగే భాష కూడా ప్రవహిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ మాతృభాషను కాపాడుకోవాలన్నారు. జిల్లా పురావస్తుశాఖ ఏడీ స్వామినాయక్ మాట్లాడుతూ తెలుగు భాషకు పద్యాలు ప్రాణం లాంటివని, చిన్నపుడు అమ్మ పాడే జోలపాటలతోనే మనకు తెలుగు భాష పద్యాలతో అనుబంధం ఏర్పడుతుందన్నారు. విద్యార్థి దశలో పద్యాలను గురించి తెలుసుకుంటామన్నారు. తెలుగు భాషా మాధుర్యం పద్యాలలోనే ఉందని చాటి చెప్పిన గొప్ప తెలుగు కవుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు షేక్ రియాజుద్దీన్ అహ్మద్, డాక్టర్ జూటూరు షరీఫ్, సిగిలిరేవు రామాంజనేయులు, టీవీ రెడ్డి, సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గిరిధర ప్రసాద్‌రాయ్, యాడికి సూర్యనారాయణరెడ్డి, ఒంటెద్దు రామలింగారెడ్డి, అశోకవర్ధన్‌రెడ్డి, పిడతల కృష్ణమూర్తి, విద్యార్థులు, పురావస్తుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇంటాక్ కన్వీనర్ రామ్‌కుమార్

అన్నదాతల ఆనందం

ఖాతాల్లో జమైన అన్నదాత సుఖీభవ డబ్బులు

సొమ్ము కోసం బ్యాంకులకు క్యూ కట్టిన రైతులు



కణేకల్లులో రైతులతో కిటకిటలాడుతున్న ఏపీజీ బ్యాంకు

కణేకల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ కావడంతో రైతుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల బ్యాంకు ఖాతాలకు గత బుధవారం రూ.7వేలు జమ చేశాయి. దీంతో ఆ డబ్బు డ్రా చేసుకోవడానికి రైతులు బ్యాంకులకు క్యూ కడుతున్నారు. మండలంలో 9414 మంది రైతులకు రూ.6.58 కోట్ల డబ్బులు మంజూరయ్యాయి. వీటిని డ్రా చేసుకోవడానికి మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లకు రైతులు రెండు రోజుల నుంచి క్యూ కడుతున్నారు. దీంతో ఆయా బ్యాంకులు కిటకిటలాడుతున్నాయి.

రెండోసారి తీసుకుంటున్నా



నేను రెండోసారి అన్నదాత సుఖీభవ డబ్బులు తీసుకుంటున్నా. ఇంతకు ముందే ఒకసారి రూ. ఏడు వేలు సొమ్ము అందుకున్నా. రెండోసారి డబ్బులు జమ కావడంతో తీసుకునేందుకు వచ్చా. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం మాటను నిలబెట్టుకోవడం అభినందనీయం.

- జయరామిరెడ్డి, రైతు, నల్లంపల్లి

19వ తేదీనే జమ



అన్నదాత సుఖీభవ కింద 19వ తేదీ మధ్యాహ్నానికే మా ఖాతాకు రూ. ఏడువేలు జమ అయ్యాయి. వ్యవసాయ పనులు చేసుకునే రైతులకు ఈ సొమ్ము ఎంతో ఉపయోగకరంగా ఉంది. భవిష్యత్‌లో కూడా ఇలాగే రైతులకు సొమ్ము అందిస్తూ ఆసరాగా ఉండాలి.

- రామన్న, రైతు, ఉడేగోళం

ఆధార్ కేంద్రాల్లో అనర్హులు..!

కనీస పరిజ్ఞానంలేని పలువురు ఆపరేటర్లు.. అప్‌డేట్లలో విఫలం

బ్లాక్ అవుతున్న కార్డులు

దరఖాస్తుదారులకు తప్పని తిప్పలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేసుకోవడం పెనుకష్టంగా మారింది. గంటలు, రోజులు పడిగాపులు కాయాల్సిందే. అన్ని వ్యయప్రయాసలకు ఓర్చి.. మార్పుచేర్పులకు దరఖాస్తు చేసుకుంటే.. 'హమ్మయ్య.. పెద్ద సమస్య తీరింది..' అని ఊపిరి పీల్చుకుంటుంటారు జనం. మార్పుచేర్పులతో కార్డు వస్తుందని ఎదురుచూస్తుంటారు. ఆ సమయంలో కార్డు అప్‌డేషన్ విఫలమైందంటూ మెసేజ్ వస్తుంది. దీంతో జనం బిక్కమొహం వేస్తున్నారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటే బెంబేలెత్తిపోతున్నారు. అయినా.. తప్పనిసరి పరిస్థితుల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు. పదేపదే రిజెక్ట్ అవుతూ.. ఆఖరుకు కార్డే బ్లాక్ అవుతోంది. దీంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇందుకు సాంకేతిక సమస్యలే కారణమని ఆధార్ సెంటర్ ఆపరేటర్లు చెబుతుంటారు. వారి అవగాహనలేమి కూడా కారణమని తెలుస్తోంది. జిల్లాలోని ఆధార్ సెంటర్లలో ఆపరేటర్లుగా పనిచేస్తున్న వారిలో చాలా మందికి అర్హతలేదని సమాచారం. కనీస అవగాహనలేని వారు ఆధార్ అప్‌డేట్ చేయలేకపోతున్నారు. వారి వైఫల్యాన్ని సాంకేతిక సమ స్య అని చెప్పి.. దరఖాస్తుదారులను మభ్య పెడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

జిల్లాలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్లలోని ఆపరేటర్లు అర్హతగలిగిన వారేనా అంటే.. కాదనే వాదనలు వినిపిస్తున్నాయి. పరీక్షలు రాయకుండానే... సంబంధిత ఏజెన్సీల అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా ఆధార్ సెంటర్లను పలువురు ఆపరేటర్లు నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా ఏమీ తెలియని ప్రజలు ఆధార్ అప్‌డేట్లలో సమస్యలు ఎదుర్కొంటున్నారనే చెప్పాలి. జిల్లాలో పలువురు ఆధార్ ఆపరేటర్ల అవతారమెత్తి సెంటర్లు నిర్వహిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నా యి. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఆధార్ సెంటర్ వద్ద ప్రజలు (ఫైల్)

పరీక్షల్లో ఉత్తీర్ణత తప్పనిసరి..

ఆధార్ సెంటర్‌లో ఆపరేటర్‌గా వ్యవహరించాలంటే తప్పనిసరిగా ఆధార్‌కు సంబంధించిన పరీక్షలు రాయాలని ఉడాయ్ నిబంధనలు చెబుతున్నాయి. ఎల్‌ఎంఎస్, ఆధార్ పరీక్షలు ఆన్‌లైన్‌లో రాయాల్సి ఉంటుంది. ఈ పరీక్షల్లో ఆధార్ సిస్టమ్ లాగిన్ ఎలా అవ్వాలి...? కార్డు అప్‌డేట్, పేర్ల మార్పులు, పుట్టిన తేదీ ఎలా మార్పు చేయాలి..? ఏయే అప్‌డేట్లకు ఎలాంటి ధృవపత్రాలను.. ఎలా అప్‌లోడ్ చేయాలి...? పెనాల్టీ..? తదితర అంశాలపై ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఉత్తీర్ణులైన ఆపరేటర్లకు ఉడాయ్ ఆన్‌లైన్ ద్వారా సర్టిఫికెట్ అందజేస్తుంది.

ఏజెన్సీ అనుమతితోనే...

ఉడాయ్ సర్టిఫికెట్ పొందినవారు.. ఆధార్ సెంటర్లు నిర్వహిస్తున్న ఏజెన్సీ ద్వారా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఆ పత్రం ఆధారంగానే కేటాయించిన ఆధార్ సెంటర్‌లో పని చేయాల్సి ఉంటుంది. కొందరు ఆపరేటర్లు ఇలాంటి అనుమతులు లేకుండానే నెట్‌సెంటర్లలో ఆధార్ అప్‌డేట్లు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎవరు పర్యవేక్షిస్తారో.. ఏమో..

జిల్లాలో ఆధార్ సెంటర్లను ఏ అధికారి పర్యవేక్షిస్తారో అర్థంకాని గందరగోళ పరిస్థితి నెలకొంది. తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్లకు పూర్తి బాధ్యత ఆ శాఖ సూపరింటెండెంట్‌దే. సచివాలయాల్లో నిర్వహించే సెంటర్లు.. కలెక్టర్, జేసీ పరిధిలో ఉంటాయి. ప్రైవేటు బ్యాంకులు, నెట్ సెంటర్లు, మీ-సేవ కేంద్రాల్లో నిర్వహించే ఆధార్ సెంటర్లు ఆయా సంస్థల పరిధిలో ఉంటాయి. వాటిని ఎవరు పర్యవేక్షిస్తారన్నది అంతుచిక్కడం లేదనే చెప్పాలి. ఈ నేపథ్యంలో పలువురు సెంటర్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా ఆధార్ అప్‌డేట్లు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆధార్ అప్‌డేట్లలో సమస్యలు

అవగాహనలేని ఆపరేటర్లతో ఆధార్ అప్‌డేట్ చేయడంలో సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు సమాచారం. అప్‌డేట్ చేసే సమయంలో సరైన పత్రాలు అప్‌లోడ్ చేయకపోవడం, సెంటర్లకు వచ్చిన ప్రజలకు ఏయే ధృవపత్రాలు కావాలో చెప్పలేకపోవడంతో పలుమార్లు ఆధార్ అప్‌డేట్లు రిజెక్ట్ అవుతున్నట్లు తెలుస్తోంది. పేరు, పుట్టిన తేదీ మార్పుల్లో చాలామంది కార్డుదారులు స్పష్టతలేక బ్లాక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. కనీసం ఏయే ధృవపత్రాలు సమర్పించాలన్న విషయాన్ని చెప్పలేని కొందరు సెంటర్లు నడుపుతుండటం విమర్శలకు తావిస్తోంది.

టమోటా కిలో రూ.52

అనంతపురం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో శుక్రవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.52తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.30తో, సరసరిగా రూ.37తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1950 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9 వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 18టన్నుల చీనీకాయలు వచ్చినట్లు చెప్పారు.

ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శిగా జాఫర్



జాఫర్



ఖాజాహుస్సేన్

అనంతపురం విద్య, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మైనార్టీ విభాగం ఇన్సాఫ్ రాష్ట్రకార్యదర్శిగా సీనియర్ నాయకుడు జాఫర్‌ను నియమించారు. ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఖాజాహుస్సేన్‌కు అవకాశం కల్పించారు. శుక్రవారం విజయవాడలో ఆల్ ఇండియా తంజీమ్-ఏ-ఇన్సాఫ్‌రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జులఈశ్వరయ్య సమక్షంలో వీరిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

గంజాయి కేసులో ఐదుగురికి పదేళ్ల జైలు

రూ.లక్ష చొప్పున జరిమానా

అనంతపురం క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గంజాయి సరఫరా, విక్రయానికి సంబంధించిన కేసులో ఐదుగురు ముద్దాయిలకు 10 ఏళ్ల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం అనంతపురం జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టు న్యాయాధికారి సత్యవాణి తీర్పు వెలువరించారు. ఆరుగురు ముద్దాయిలకు శిక్ష విధించగా.. ఏ6 ముద్దాయి ఇప్పటికే మరణించాడు. వివరాల్లోకి వెళితే.. అనంతపురం రూరల్ మండలం రుద్రంపేటకు చెందిన గంగాధర్ (36), స్వాతి(34) ఇంట్లో 2020 జూలై 18న స్పెషల్ డ్యూటీ ఆఫీసర్, సెబ్ సీఐ మారుతీరావు, 4వ పట్టణ సీఐ శ్రీనివాసులు తనిఖీలు చేశారు. వారి వద్ద 30 కిలోల గంజాయి దొరకడంతో సీజ్ చేశారు. అదేవిధంగా తాటిచెర్లకు చెందిన మేకల ప్రసాద్(40) వద్ద 10 కిలోలు, పొట్టి శ్రీరాములు కాలనీకి చెందిన షేక్ గౌసియా(44) వద్ద 10 కిలోలు, గుంతకల్లు మండలం తిమ్మాపురానికి షేక్ హాజీవలి(28) వద్ద రెండున్నర కిలోలు గంజాయి దొరకడంతో కేసులు నమోదు చేశారు. కేసు విచారణ తర్వాత సీఐ ప్రతాప్ ఎరెడ్డి జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసును న్యాయాధికారి సత్యవాణి విచారణ చేశారు. ఐదుగురు ముద్దాయిలు నేరం చేసినట్టు రుజువు కావడంతో.. గంగాధర్, స్వాతి, ప్రసాద్, షేక్ గౌసియా, షేక్ హాజీవలికి 10 ఏళ్ల జైలు శిక్ష విధించారు. అదేవిధంగా ముద్దాయిలకు తలా రూ. లక్ష జరిమాన కూడా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో 6వ ముద్దాయిగా ఉన్న అనంతపురంలోని భైరవనగర్‌కు చెందిన అడవాల చంద్రశేఖర్(30) మరణించాడు.

లక్షణంగా కొట్టేశాడు

లింక్‌తో వీఆర్ఓను బురిడీ కొట్టించిన ఆర్ఐ

రూ.1.19లక్షలు స్వాహా



నగదు డెబిట్ అయిన స్క్రీన్‌షాట్

పెనుకొండ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తన డిపార్ట్‌మెంట్ ఉద్యోగి పంపిన లింక్‌ను ఓపెన్ చేసిన ఓ వీఆర్ఓ రూ.1.19 లక్షలు పోగొట్టుకున్న సంఘటన పెనుకొండలో ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితురాలైన వీఆర్ఓ యశస్విని తెలిపిన మేరకు.. పెనుకొండలో ఆర్ఐగా పని చేసి బదిలీపై వెళ్లిపోయిన పురుషోత్తం నంబర్ నుంచి తనకు వాట్సాప్ ద్వారా ఆర్టీఓ ట్రాఫిక్ చలానా అనే యాప్‌లింక్ బుధవారం వచ్చిందన్నారు. ఏంటి ఇది అని అతడికి మెసేజ్ పెట్టగా, ఓపెన్ చేయమని సమాధానం వచ్చిందన్నారు. దీంతో ఒకే డిపార్ట్‌మెంట్ కదా అనుమానించడానికే ముందని, రెవెన్యూ సేవలకు అవసరం అవుతుందేమోననే నమ్మకంతో ఆ లింక్ ఓపెన్ చేసినట్లు తెలిపారు. ఇంతలో తన అకౌంట్‌లో ఉన్న రూ.1.19లక్షలు డెబిట్ అయినట్లు మెసేజ్ రావడంతో ఆందోళనతో బ్యాంక్ బాలెన్స్ చెక్‌చేస్తే నగదు కనిపించలేదని తెలిపారు. దీంతో పుట్టపర్తి సైబర్ క్రైం కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


వంశీ (ఫైల్)

తాడిపత్రి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమలి-జూటూరు సమీపంలో వంశీ (21) శుక్రవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వరప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు పెద్దపప్పూరు మండలం తబ్బుల గ్రామానికి చెందిన రామాంజనేయులు, నాగమ్మ దంపతుల కుమారుడు వంశీ చిత్తూరు జిల్లా ఎస్వీసెట్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ అర్ధాంతరంగా వదిలేశాడు. ఇంటికి వచ్చి ఖాళీగా ఉండేవాడు. చదువు అబ్బడం లేదని, ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నానని తరచూ తన స్నేహితులతో చెప్పేవాడు. భవిష్యత్తుపై బెంగతోనే దిక్కుతోచక ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పనులు వేగంగా పూర్తి చేయాలి

పీఆర్ ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఐయూ (ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్) ద్వారా చేపట్టే అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు పీఆర్ ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు ఆదేశించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా ఏపీఆర్ఆర్‌పీ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా చూడాలని సూచించారు. మిగిలిన స్కీమ్స్ ద్వారా జరుగుతున్న పనులు మార్చిలోపు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. కాంట్రాక్టర్లకు ఫీల్డ్‌లో ఏదైనా సమస్య ఉంటే వాటికి తగిన పరిష్కారమార్గాలు చూపాలని పేర్కొన్నారు. సమావేశంలో ఈఈలు శ్రీరాములు, శంకరయ్య, పీఏ టూ ఎస్ఈ రాజేంద్రప్రసాద్, డీఈలు తిరుమలరెడ్డి, నారాయణస్వామి, సుధాకర్ నాయక్, నాగేంద్రకుమార్, మధన్‌మోహన్, మురళీధర్, వెంకటేష్, హనుమంతయ్య శెట్టి, ఏఈఈలు రజినీకాంతరెడ్డి, పాండురంగారెడ్డి, సూర్యశేఖర్, మల్లికార్జున, రాజేంద్రప్రసాద్, నళిని, ప్రసాద్, రామాంజనేయులు, కాంట్రాక్టర్లు వెంకటనాగిరెడ్డి, ఈశ్వరరెడ్డి, గోపాల్‌రెడ్డి, శోమశేకర్‌రెడ్డి, సుధాకర్, ధనంజయనాయుడు, వెంకటేష్ సర్కిల్ ఆఫీస్ ఏఈఈ లక్ష్మీదేవి పాల్గొన్నారు.


రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం


పత్తి కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గుత్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతాంగ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పత్తి రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తోందన్నారు. పత్తిలో తేమ శాతాన్ని బట్టి రైతులకు ధర అందుతుందన్నారు. గరిష్ఠంగా క్వింటాల్‌కు రూ.8100, కనిష్ఠంగా రూ.8010వేలు ధర చెల్లిస్తారని తెలిపారు. రైతులు దళారుల చేతిలో మోస పోకుండా పత్తికొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఏఈ రాఘవేంద్రకుమార్, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఆర్డీఓ శ్రీనివాస్, ఏడీఏ వెంకటరాముడు, తహసీల్దార్ పుణ్యవతి, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రతాప్, గుత్తి, పామిడి, పెద్దవడుగూరు ఏఓలు ముస్తాక్ అహ్మద్, విజయ్‌కుమార్, మునికృష్ణ, మార్కెట్ యార్డు సెక్రటరీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ టేబుల్‌టెన్నిస్ పోటీలకు ఎంపిక


కోచ్, తండ్రితో మనస్విని

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ టేబుల్‌టెన్నిస్ పోటీలకు మనస్విని ఎంపికయింది. ఈనెల 22వతేదీ నుంచి జమ్మూకశ్మీర్‌లోని జమ్మూ యూనివర్సిటీలో జరిగే నేషనల్ టేబుల్‌టెన్నిస్ టోర్నమెంట్‌లో అండర్-19 బాలికల విభాగంలో మనస్విని రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. జాతీయ పోటీలకు ఎంపికైన మనస్వినిని ఆమె తండ్రి, రాయ్ టేబుల్‌టెన్నిస్ అకాడమీ కోచ్ రవీంద్రనాథ్, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

ఉపాధి అక్రమాలకు చెక్ పడేనా..?

ఈకేవైసీతో 50వేలకుపైగా కూలీల తొలగింపు

5,26,534 మందికిగాను..

4,12,361 మందితో ఐరిష్ సేకరణ

నేడు గ్రామ సభలు.. అభ్యంతరాల స్వీకరణ


శింగనమల మండలంలో ఉపాధి కూలీకి ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

అనంతపురం అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అంతేలేదు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం కొత్త నిబంధనలు అమలు చేస్తున్నా లొసుగులను అడ్డం పెట్టుకుని కొందరు ఆయాచితంగా లబ్ధిపొందుతున్నారు. ప్రస్తుతం తీసుకువచ్చిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) విధానం అమలుతోనయినా ఉపాధి అక్రమాలకు చెక్ పడేనా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమాలను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలతో ఈకేవైసీ చేయిస్తోంది. అక్టోబరు నుంచి ఉపాధి కూలీలతో ఈకేవైసీ చేయడం మొదలు పెట్టారు. ఈ విధానంలో ఉపాధి కూలీల ఐరిస్ ఫొటో తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. తొలుత అక్టోబరు నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. నవంబరు నుంచి ఈకేవైసీ చేయించుకున్న కూలీలకు మాత్రమే వేతనాలు మంజూరు చేయాలని నిర్ణయించారు. క్షేత్ర స్థాయిలో ఆశించిన మేరకు ఈకేవైసీ పూర్తి చేయకపోవడంతో గడువును పొడించారు. అయినప్పటికీ పలు గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లోని కూలీలతో ఈకేవైసీ చేయించడంలో సిబ్బంది జాప్యం చేస్తుండటం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా 5,26,534 మంది ఉపాధి కూలీలు ఉన్నట్లు జాబితాలో చేర్చారు. ఇందులో ఇప్పటి దాకా 4,12,361 మందితో (78.35 శాతం) ఐరిస్ సేకరణ పూర్తి చేశారు. ఇంకా 1.14 లక్షల మంది పెండింగ్ జాబితాలో ఉన్నారు.

బయటపడుతున్న బోగస్ కార్డులు

ఉపాధి కూలీలతో ఈకేవైసీ ప్రక్రియలో బోగస్ జాబ్ కార్డులు, కూలీలు బయటపడుతున్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 50వేల మందికిపైగా కూలీల పేర్లను తొలగించినట్లు తెలిసింది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ వర్గాల ద్వారా అందిన సమాచారం. ఈ నేపథ్యంలో తమకు అనుకూలమైన వారి పేర్లను అలాగే ఉంచేందుకు పలు మండలాల్లోని అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల నుంచి డ్వామా అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి పెరిగినట్లు తెలుస్తోంది. ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయడంలో పలు ప్రాంతాల్లో జాప్యానికి రాజకీయ నేతల నుంచి సిబ్బందికి ఒత్తిళ్లే కారణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు పలువురు కూలీలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లారు. అలాంటి కూలీలకు సమాచారం అందించి, ఈకేవైసీ చేయించడంలో పలు ప్రాంతాల్లోని అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

నేడు పంచాయతీల్లో గ్రామ సభలు

జిల్లా వ్యాప్తంగా శనివారం అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈకేవైసీ ప్రక్రియలో తొలగించిన వారిలో నిజమైన కూలీలు ఉంటే గ్రామ సభల్లో అర్జీలు సమర్పించుకునేందుకు అవకాశం కల్పించారు. కొత్త జాబ్ కార్డులు, ఉపాధి పనుల కోసం కూడా దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ మేరకు డ్వామా అధికారులు, సిబ్బంది గ్రామ సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. గ్రామ సభల్లో ఈకేవైసీ వివరాలు ప్రదర్శించి, అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఈకేవైసీ ప్రక్రియలో భాగంగా తొలగించిన జాబితాలో నిజమైన కూలీలు ఉంటే తిరిగి జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటారు. సందట్లో సడేమియా అన్న చందంగా కొందరు రాజకీయ నాయకులు ఉపాధి పనులకు వెళ్లకుండా ఇదివరకు డబ్బులు కాజేసిన తమకు అనుకూలమైన వారి పేర్లను జాబితాలో తిరిగి ఎక్కించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో ఈకేవైసీ ప్రక్రియ వంద శాతం సవ్యంగా సాగుతుందో..? లేదోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శనివారం గ్రామ సభలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ఈకేవైసీ ప్రక్రియలో తొలగించిన జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తాం. అలాగే కొత్తగా జాబ్ కార్డులు, ఉపాధి పనుల కల్పన కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలి. ఈకేవైసీ ప్రక్రియ పూర్తయిన తర్వాత.. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలతో వ్యక్తిగతంగా ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. తద్వారా ఉపాధి పనుల్లో అక్రమాలను అరికట్టవచ్చు.

- సలీం బాషా, డ్వామా పీడీ

నాలుగేళ్ల కిందటి కేసు విచారణ

నారాయణ మృతి కేసులో విచారణ ప్రారంభం

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

నా భర్తను పోలీసులే చంపారు: మృతురాలి భార్య


నారాయణ (ఫైల్)

పెద్దపప్పూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమనపల్లి గ్రామానికి చెందిన నారాయణ మృతిపై అనంతపురం డీఎస్పీ శ్రీనివాసులు శుక్రవారం విచారణ ప్రారంభించారు. నారాయణ 2021 ఆగస్టు 2న మృతి చెందిన విషయం తెలిసిందే. తన భర్త చావుకు అప్పటి డీఎస్పీ చైతన్య, ఎస్ఐ గౌస్ కారణమని నారాయణ భార్య వెంకటలక్ష్మి అధికారుల వద్ద అప్పట్లోనే వాపోయింది. కానీ ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక విషయాన్ని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డికి ఆమె వివరించింది. దీంతో ఆయన నారాయణ మృతి విషయాన్ని అసెంబ్లీ వేదికగా లేవనెత్తారు. దీంతో ప్రభుత్వం ఈ కేసును కూలంకషంగా విచారించాలని జిల్లా అధికారులను ఆదేశించింది. ఈనేపథ్యంలో అనంతపురం డీఎస్పీ శ్రీనివాసులు శుక్రవారం సంఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. నారాయణ ఎలా మరణించారు కారణాలు ఎవరెవరు అనే దానిపైన పలువురిని విచారించారు. వీటిపై త్వరలో నివేదిక ఇస్తామని ఆయన తెలిపారు.

విచారణ కోసం తీసుకెళ్లి..

బాధితురాలు వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు... తన భర్త నారాయణను 2021 ఆగస్టు 1 పొలం సమస్య విచారణ కోసం పోలీస్‌స్టేషన్‌కు రావాలని అప్పటి ఎస్ఐ గౌస్ పిలిపించారు. అదే రోజు సాయంత్రం ఆశా వర్కర్ ఇంటి వద్దకు వచ్చి 'మీ భర్త ఆరోగ్యం బాగాలేదు. మీ కుటుంబ సభ్యులు అందరూ కలిసి తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లండి' అని తెలిపారు. దీంతో వెంకటలక్ష్మి తన కుమారుడు, కుమార్తెను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి, బంధువులతో కలిసి పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. 'నీ భర్తను తాడిపత్రి డీఎస్పీ ఆఫీస్‌కు చైతన్య సార్ తీసుకురమ్మని చెప్పారు. మేము అక్కడకు పంపాం' అని కానిస్టేబుల్ చెప్పాడన్నారు. దీంతో కంగారుగా అక్కడికి వెళ్లి చూడగా తన భర్త విగతజీవిగా పడి ఉన్నాడని ఆమె వాపోయారు. అప్పటి డీఎస్పీ చైతన్య , ఎస్ఐ గౌస్ విచారణకు తీసుకువెళ్లి నా భర్తను చంపారని ఆమె ఆరోపించారు. ఈ విషయాన్ని ఎవరికి చెప్పవద్దని నీ కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని, డబ్బులు ఇస్తానని ఎస్ఐ గౌస్ మభ్యపెట్టి తన భర్త శవాన్ని దహనం చేయించినట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

అరటి రైతులను ఆదుకోవాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్


అరటి తోటలో రైతులతో రాంభూపాల్, నల్లప్ప

బుక్కరాయసముద్రం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధరలేక నష్టపోయిన ఉమ్మడి జిల్లా అరటి రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్ చేశారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో సాగు చేసిన అరటి పంటను శుక్రవారం వారు పరిశీలించారు. నష్టపోయిన రైతులను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ రెడ్డిపల్లికి చెందిన రైతు హనుమంతు నాలుగన్నర ఎకరాల్లో అరటి పంట సాగు చేయడానికి రూ.5 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టారన్నారు. పంట విక్రయిస్తే రూ. 45 వేలు మాత్రమే వచ్చిందన్నారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 15వేల హెక్టార్లలో అరటి సాగు చేస్తే రూ. 700 కోట్లకుపైగా నష్టం వచ్చిందన్నారు. రైతుల ఇంత నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మార్కెట్‌లో అరటి కిలో రూపాయి మాత్రమే ఉందన్నారు. దీంతో రైతులు పంటను మార్కెట్‌కు తరలించలేక గొర్రెలు, పశువులు వదిలేస్తున్నారన్నారు. అరటి పంట టన్ను 15వేలుతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అరటి రైతులకు అదుకోకపోతే సీపీఎం అధ్వర్యంలో పెత్తు ఎత్తున అందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

1న సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ఆర్టీసీ జోనల్ కళాశాల ప్రిన్సిపాల్ నజీర్ అహ్మద్

అనంతపురం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం అక్టోబరు 25 నుంచి ఈనెల 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతపురం జిల్లా ఐటీఐ అభ్యర్థులకు డిసెంబరు 1న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు ఆర్టీసీ జోనల్ కళాశాల ప్రిన్సిపాల్ నజీర్ అహ్మద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హతలు, క్రీడలకు సంబంధించిన ధ్రువ పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకు ఖాతా పాస్‌బుక్కు, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు అన్నీ ఒక సెట్ జిరాక్స్ కాపీలతో కర్నూలులోని ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాలకు చేరుకోవాల న్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రూ.118ల ఫీజు చెల్లించాలన్నారు. డిసెంబరు 1న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు డీజిల్ మెకానిక్ ట్రేడ్ అభ్యర్థులకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్(సివిల్) ఉద్యోగాల అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు వారికి కేటాయించిన సమయాల్లో వెరిఫికేషన్‌కు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 08518-275025 నంబర్‌ను సంప్రదించవచ్చునన్నారు.

30న భగవద్గీతపై పోటీలు

టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ బాబు

అనంతపురం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గీత జయంతిని పురస్కరించుకుని ఈనెల 30న జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణమండపంలో భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ బాబు వెల్లడించారు. టీటీడీ కల్యాణమండపం ఆవరణలో శుక్రవారం గీత జయంతి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ పోటీల్లో భాగంగా 6, 7, 8, 9వ తరగతుల విద్యార్థులకు భగవద్గీతలోని 14వ అధ్యాయం గుణత్రయ విభాగయోగంపై పోటీలుంటాయన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు భగవద్గీత 16వ అధ్యాయంలోని దైవాసుర సంపద్విభాగయోగంపై, అలాగే 18 సంవత్సరాలు నిండిన వారికి నిత్యజీవితంలో భగవద్గీత భావ విశ్లేషణపై పోటీలు నిర్వహిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని విద్యా సంస్థలు, ఆధ్యాత్మిక బృందాలు పిల్లలను ఈ పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. పోటీల్లో పాల్గొనేవారిలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు.

బాధ్యతగా పనిచేయండి

నూతన ఏఓలకు జడ్పీ చైర్‌పర్సన్ సూచన

అనంతపురం న్యూటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బాధ్యతగా పనిచేసి మంచి గుర్తింపు తీసుకురావాలని ఉద్యోగోన్నతి పొందిన ఏఓలకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ సూచించారు. సీనియర్ అసిస్టెంట్ల నుంచి ఏఓలుగా ఉద్యోగోన్నతి పొందిన 8 మందికి శుక్రవారం జడ్పీ కార్యాలయంలో ప్లేస్‌మెంట్స్ కేటాయించారు. ఉద్యోగోన్నతి పొందిన వారికి చైర్‌పర్సన్ చేతుల మీదుగా ప్లేస్‌మెంట్స్‌కు సంబంధించిన నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటి వరకు సీనియర్ అసిస్టెంట్‌గా కొంత వరకు బాధ్యత తక్కువగా ఉంటుందని, ఏఓ అంటే అదనపు భారం ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగా పనిచేసి మంచి గుర్తింపు పొందాలని సూచించారు. ఉద్యోగోన్నతి పొందిన వారికి ప్లేస్‌మెంట్లను కేటాయించారు. లెక్కలు శ్రీనివాసులు (జడ్పీ కార్యాలయం, అనంతపురం), పూర్ణ ఖలందర్ (ఎంపీపీ కార్యాలయం వజ్రకరూరు), కేటీ శ్రీధర్‌శర్మ (ఎంపీపీ, కనగానపల్లి), కె. భీమలింగస్వామి (ఎంపీపీ, రొద్దం), అశోక్‌కుమార్‌రెడ్డి (ఎంపీపీ, నల్లచెరువు), ఏకాంబరేశ్వరయ్య (ఎంపీపీ, గోరంట్ల), అబ్దుల్ రహీమాన్ (ఎంపీపీ, గుడిబండ), సురేష్‌రెడ్డి (ఎంపీపీ కార్యాయలం, తాడిమర్రి)కి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఏఓ విజయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్చి 16 నుంచి 'పది' పబ్లిక్ పరీక్షలు

కొత్తచెరువు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు వచ్చే ఏడాది మార్చి 16 నుంచి ఏప్రిల్ 1దాకా జరుగుతాయని విద్యాశాఖ ఏడీ, జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి లాజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 16న తెలుగు పేపర్-1, 18న హిందీ, 20న ఇంగ్లిషు, 23న గణితం, 25న ఫిజిక్స్, 28న బయాలజీ, 30న సోషియల్, 31న ఫస్ట్‌లాంగ్వేజ్ పేపర్-2, ఏప్రిల్ 1న ఒకేషనల్ కోర్సు థియరీ పరీక్షలు ఉంటాయని ఆయన తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9-30గంటల నుంచి మధ్యాహ్నం 12-45గంటల వరకు పరీక్షలు జరుగుతాయని ఆయన తెలిపారు.

5న సివిల్స్ ఉచిత శిక్షణకు స్క్రీనింగ్ పరీక్ష

అనంతపురం విద్య, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ ఉచిత శిక్షణకు అభ్యర్థులను ఎంపిక చేయడానికి డిసెంబరు 5న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు బీసీ వెల్ఫేర్ శాఖ డీడీ కుష్బూకొఠారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. స్క్రీనింగ్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు వసతి, భోజనంతో కూడిన ఉచిత శిక్షణ విజయవాడలో ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 25లోగా దరఖాస్తులను జిల్లా బీసీ స్టడీ సెంటర్‌లో అందజేయాలన్నారు. బయోడేటాతో పాటు టెన్త్, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వార్షికాదాయం ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు దరఖాస్తుతో పాటు అందజేయాలన్నారు.

31మందికి డిప్యూటీ ఎంపీడీఓలుగా ప్రమోషన్

అనంతపురం న్యూటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 31 మందికి డిప్యూటీ ఎంపీడీఓలుగా ప్రమోషన్ ఇచ్చినట్లు డీపీఓ నాగరాజనాయుడు శుక్రవారం తెలిపారు. కమిషనర్ నుంచి వచ్చే ఉత్తర్వుల మేరకు వీరికి మండలాల కేటాయింపు ఉంటుందన్నారు. ప్రమోషన్ పొందిన వారి వివరాలు ఇలా.. సాదిక్‌వలి, శ్రీధర్‌రావు, అచ్యుతానందబాబు, బాబాఫక్రుద్దీన్, శ్రీనివాసులు, రంగనాయకులు, రాజశేఖర్, గౌస్‌సాబ్, భీమలింగస్వామి, ఉషారాణి, మహమ్మద్‌రఫీ, హిదయతుల్లా, చంద్రశేఖర్, ఏకాంభరేశ్వరయ్య, వీవీ నరసయ్య, సమీర్‌ఖాన్, శారద అక్బర్‌వలి, సుజాత, నాగిరెడ్డి, జిలాన్ బాషా, కాంతమ్మ, నందకుమార్, సుకన్య, సరిత, షేక్షావలి, జయప్రద, శశికళావతిబాయ్ ఉన్నారు. వీరిలో గ్రేడ్-1 కార్యదర్శి, సీనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి డిప్యూటీ ఎంపీడీఓలుగా ప్రమోషన్ పొందినవారు ఉన్నట్లు వెల్లడించారు. వరప్రసాద్‌రావును అన్నమయ్య జిల్లా నుంచి అనంతపురం జిల్లాకు కేటాయించినట్లు తెలిపారు. హనుమేష్, జీవేశ్వరయ్యను కర్నూలు జిల్లా నుంచి అనంతపురం జిల్లాకు కేటాయించినట్లు పేర్కొన్నారు. వీరందరికి కమిషనర్ ఆదేశాల మేరకు కలెక్టర్ ఉత్తర్వులతో నిబంధనల మేరకు మండలాలు కేటాయిస్తామన్నారు. అనంతరం డెప్యుటేషన్‌పై మండల గ్రామ-వార్డు సచివాలయ అధికారిగా నియమిస్తామని తెలిపారు.

మరణంలోనూ ఒక్కటిగా..!

అనారోగ్యంతో రిటైర్డు వీఆర్ఏ మృతి.. షాక్‌తో భార్య..


నాగన్న దంపతులు (ఫైల్)

తాడిమర్రి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల దాంపత్య జీవితంలో ఒక్కటిసాగిన ఆ దంపతులు మృత్యువులోనూ కలిసి సాగారు. భర్త మరణవార్త విని భార్య అస్వస్థతతో మరణించిన ఘటన తాడిమర్రిలో శుక్రవారం జరిగింది. మండల కేంద్రానికి చెందిన ఎట్టినాగన్న(85) అనారోగ్యంతో పది రోజులుగా అనంతపురంలో చికిత్స పొందుతుండేవాడు. ఆయనకు తోడుగా భార్యలింగమ్మ(80)అక్కడే ఉండేది. శుక్రవారం ఉదయం 11గంటల సమయంలో నాగన్న మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న భార్య లింగమ్మ షాక్‌తో స్పృహ కోల్పోయింది. పరీక్షించిన డాక్టర్లు లింగమ్మ పరిస్థితి సీరియస్‌గా ఉందని బెంగళూరుకు తీసుకెళ్లాలని కుటుంబసభ్యులకు సూచించారు. దీంతో కొందరు నాగన్న శవాన్ని తాడిమర్రికి తీసుకురాగా మరికొంతమంది లింగమ్మను తీసుకుని బెంగళూరుకు వెళ్లారు. సాయంత్రం 6గంటలకు నాగన్న అంత్రక్రియలు పూర్తిచేశారు. లింగ్మను బెంగళూరులో ఓప్రైవేటు వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతూ 6:30గంటలకు ఆమె మృతి చెందారు. నాగన్న, లింగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం రాలేదని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం పట్టణ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు బ్రహ్మసముద్రం మండలం ఎనకల్లు గ్రామానికి చెందిన బోయ ఆనంద్ (21) డిగ్రీ వరకు చదువుకున్నాడు. అనంతరం ఉద్యోగం బెంగళూరు తదతర ప్రాంతాలకు వెళ్లాడు. ఎక్కడా ఉద్యోగం దొరక్కపోవడంతో రెండు రోజుల క్రితం తన స్వగ్రామమైన ఎనకల్లుకు తిరిగి వచ్చాడన్నారు. ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో గురువారం కళ్యాణదుర్గం పట్టణ శివారులో పురుగుల మందు తాగాడన్నారు. తర్వాత ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఆందోళన వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ఆనంద్‌ను కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత మృతి చెందినట్లు తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యం


శ్యామ్‌చరణ్

అనంతపురం క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని అరవింద్ నగర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి శుక్రవారం అదృశ్యమయ్యాడు. అనంతపురం టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపిన మేరకు అరవింద్ నగర్‌కు చెందిన రామాంజినేయులు కుమారుడు దాసరి శ్యామ్ చరణ్(15) నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. యథావిధిగా ఉదయం స్కూ ల్‌కు వెళ్లిన శ్యామ్ చరణ్ తర్వాత ఇంటికి తిరిగి వెళ్లలేదు. పలుచోట్ల గాలించిన తల్లిదండ్రులు ఫలితం లేకపోవడంతో చివరకు పోలీసులను ఆశ్రయించారు. కాగా విద్యార్థిని తల్లిదండ్రులు మందలించినట్లు సమాచారం. దీంతో మనస్తాపం చెంది ఇంటి నుంచీ వెళ్లినట్లు తెలిసింది. విద్యార్థి గుండు గీయించుకున్నాడని, రెండు చెవులకు కమ్మలు ఉన్నాయని, ఆచూకీ తెలిపిన వారు 9440796806, 9346917119 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

శత జయంతి సంబరం

విశ్వమంతా ప్రేమను పంచిన సత్యసాయి శతజయంతి సంబరాలకు దేశవ్యాప్తంగా కీలక నాయకులు, అధికారులు తరలివస్తున్నారు. శుక్రవారం మహారాష్ట్ర సీఎం, ఒడిశా గవర్నర్ సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌ను ఆశీర్వదిస్తున్న వేదపండితుడు



ఒడిశా గవర్నర్, మహారాష్ట్ర సీఎంలకు సత్యసాయి జ్ఞాపికను అందజేస్తున్న ఆర్‌జే రత్నాకర్


సత్యసాయి సన్నిధిలో సంగీత, గాన కచేరీ


వేడుకల్లో పాల్గొన్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి


భక్తిగీతాలు ఆలపిస్తున్న దృశ్యం

న్యూస్ బాక్స్

ముగిసిన కార్తీక మాస పూజలు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

ధర్మవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు రోజు అమావాస్య సందర్భంగా పట్టణంలోని శివానగర్‌లో శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం శివునికి వివిధ రకాల పూలు, తులసీ ఆలకులతో అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అభిషేకాలు, పంచామృతాభిషేకం, అర్చనలు తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించారు. శివున్ని దర్శించుకోవడానికి భక్తులు వేలాదిగా తరలివచ్చి ప్రత్యేక పూజలు చేయించారు. మహిళలు ఆలయంఎదుట దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే


స్వామికి పూజ చేయిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

నల్లచెరువు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లిలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అర్చకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని వడ్డించారు. మండల కేంద్రంలో గత కొంతకాలంగా ఆరోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నాయకుడు బార్ ఫయాజ్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. మండల కన్వీనర్ రాజశేఖర్, దాదెం వెంకటశివారెడ్డి, మాజీ ఎంపీపీలు అబ్దుల్ ఖాదర్, మాబు సాహెబ్, సర్పంచ్ హర్షవర్ధన్ నాయుడు, తెలుగు యువత అధ్యక్షులు గుత్తా ప్రసాద్, నాయకులు సతీష్ చౌదరి, బేకరీ నాగరాజు, దేవేంద్రగౌడ్, నాగిరెడ్డి, రాళ్ళపల్లి బావాజాన్, గిరినాథ్‌రెడ్డి, అల్లాబకాష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థితో పాఠశాల హెచ్‌ఎం, పీఈటీలు

ధర్మవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో గత నెలలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 హాకీ జిల్లాస్థాయి పోటీలలో ఆదిత్య పాఠశాల విద్యార్థి మోక్షిత్ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం జనార్దన్ తెలిపారు. శనివారం తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం సుజాత

జీవన్‌జ్యోతిపాఠశాల విద్యార్థులు..: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ హాకీ పోటీలకు జీవన్‌జ్యోతి పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు హెడ్‌మిస్టర్ సిస్టర్ సుజాత తెలిపారు. గతనెల 18న అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడిజిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ హాకీ పోటీల్లో ధర్మవరం జీవన్‌జ్యోతిపాఠశాల విద్యార్థులు విక్కి, ఆర్, వరుణ్, గుణశ్రీ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. శనివారం నుంచి తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. శుక్రవారం ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెడ్‌మిస్టర్, కరస్పాండెంట్ సిస్టర్ రిస్సీ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉలవల పంపిణీ ప్రారంభం


రైతులకు ఉలవలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తనకల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లిరెడ్డిపల్లి రైతు సేవా కేంద్రంలో శుక్రవారం ఉలవల పంపిణీని టీడీపీ నాయకులు సూర్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం సబ్సిడీతో ఇస్తున్న ఉలవలను రైతులకు అందించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అన్నిరకాల సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే, పరిష్కారానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధికారులతో చర్చించి, పరిష్కరిస్తారన్నారు. నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయ సహాయకురాలు సంధ్యారాణి పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

ధర్మవరంరూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సివిల్ సప్లై హమాలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించి, సమస్యలు పరిష్కారించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో హమాలీలతో సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ హమాలీలకు వేతనాలతో పాటు పీఎఫ్ అమలు చేయాలన్నారు. ఈఎస్‌ఐపై కోర్టులో ఉన్న కేసును ప్రభుత్వం త్వరితగతిన పరిష్కారించే విధం గా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్వీపింగ్, తాగునీరు, సప్లయ్ బిల్లులు 9నెలలుగా చెల్లించలేదని, హమాలీలు పట్ల ప్రభ త్వం నిర్లక్ష్యం వీడాలన్నారు. సీఐటీయూ నాయకులు కోటి, ఎస్‌హెచ్ బాషా, అయూబ్ ఖాన్, రఫీ, నాగరాజు, నేలకోటప్ప, లక్ష్మన్న, కదిరప్ప పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

బాడీ బిల్డర్లకు ఎమ్మెల్యే అభినందన

కదిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇండోనేషియలోని బతంగ్‌లో ఇటీవల జరిగిన ప్రపంచ బాడీ బిల్డింగ్, ఫిజిక్స్ స్పోర్ట్స్ విభాగంలో గెలుపొందిన భారతీయ బాడీ బిల్డర్లను ఎమ్మెల్యే, సత్యసాయిజిల్లా బాడీ బిల్డింగ్ ఫిట్నెస్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కందికుంట వెంకటప్రసాద్ అభినందించారు. ఎమ్మెల్యే శుక్రవారం పట్టణంలోని లోటస్ జిమ్‌లో కేక్ కట్‌చేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల ఇండోనేషియాలోని బతంగ్‌లో ప్రపంచ బాడీ బిల్డింగ్ పోటీల్లో తమిళనాడుకు చెందిన శర్వనన్ మణి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచి ప్రతిష్టాత్మక మిస్టర్ యూనివర్స్ టైటిల్‌ను సాధించాడన్నారు. అలాగే దేశానికి అత్యధిక మోడల్స్ సాధించి క్రీడాకారులు భారతదేశ కీర్తిని ఇనుమడింపచేశారన్నారు. ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు స్వామి రమేష్ కుమార్ నాయకత్వంలో ఈ ఘనవిజయాలు సాధినండం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రమేష్, శ్రీనివాసులు, గల్లా శ్రీనివాస్, జగన్, డాక్టర్ జానకిరామ్, సురేష్‌కుమార్‌రెడ్డి, హనీష్ పాల్గొన్నారు.

పట్టు రైతులకు ఇన్సెంటివ్ విడుదల చేయాలి

ధర్మవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టు రైతులకు పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్ విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హరి, జంగాలపల్లి పెద్దన్న, రైతు కూలీ సంఘం కార్యదర్శి గిరీశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రైతుసంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 26వ తేదీన జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఢిల్లీ రైతాంగ ఉద్యమ 5వ వార్షికోత్సవం సందర్భంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జిల్లాలోని రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దారెడ్డి, సహాయ కార్యదర్శి మారుతి, సీఐటీయూ ఆదినారాయణ, వ్యవసాయ కూలీ సంఘం బాలస్వామి పాల్గొన్నారు.

నేడు పశువైద్య శిబిరం

కొత్తచెరువు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం పశువైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు పశువైద్యశాఖ ఏడీ మల్లేశ్‌పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడి ఆవులు, గేదెలకు వైద్యపరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉపాధిహామీ పనుల సమీక్షపై నేడు గ్రామసభలు

ధర్మవరం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల కల్పన, నూతన జాబ్‌కార్డుల మంజూరు, ఈకేవైసీ తదితర వాటిపై శనివారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయిమనోహర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని, ఈ సభలలో 2026-27 ఆర్థిక ప్రణాళిక పనులు గుర్తించాలని, జాబ్‌కార్డుల తొలగింపు, కొత్తవి మంజూరు, శ్రామికులకు పనుల కల్పన, పనుల డిమాండ్ తీసుకోవడం తదితరవాటిని చేయాలన్నారు. సభల్లో సర్పంచ్‌లు, ఎంపీడీఓలు, జడ్పీటీసీలు, ఉపాధిహామీ శ్రామికులు, రైతులు, డిప్యూటీ ఎంపీడీఓ, గ్రామపంచాయతీ అధికారి పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో దండోరా వేసి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఏపీఓ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్లు బాధ్యతగా పని చేయాలి

కదిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ హెల్పర్లు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సీడీపీఓ రాధిక సూచించారు. ప్రాజెక్ట్ పరిధిలోని తలుపుల, నంబులపూలకుంట సెక్టార్‌లో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ హెల్పర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్రాల పరిశుభ్రత, విధులపట్ల అంకితభావంతో పనిచేస్తూ సమయపాలన పాటించాలన్నారు. పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేంద్రాలను రోజువారిగా శుభ్రం చేయాలన్నారు. పిల్లలను ఇంటి వద్ద నుంచి అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకువచ్చి తిరిగి ఇంటికి చేర్చాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉంటుందన్నారు. సూపర్‌వైజర్లు నిహారిక, దీప, జయశ్రీ పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు


బ్యాంకు వ్యవస్థాపకుల చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న సిబ్బంది

ధర్మవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని కరూర్ వైశ్యాబ్యాంక్ మేనేజర్ సతీశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక నేసేపేటలోని కరూర్ వైశ్యాబ్యాంక్ ధర్మవరంలో స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖాతాదారులతో సమీక్ష సమావేశం నిర్వహించి వార్షికోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కరూర్ వైశ్యాబ్యాంకు బ్యాంకింగ్ రంగంలో 109 సంవత్సరాలుగా సేవలు అందిస్తోందన్నారు. ప్రత్యేకించి తిరుపతి రీజియన్‌లోని ధర్మవరం బ్రాంచ్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ప్రస్తుతం ఈ బ్యాంకు రూ.375 కోట్ల టర్నోవర్‌ను అధిగమించి రూ.400కోట్లకు దగ్గరలో ఉందన్నారు. బ్యాంకు సిబ్బంది కృష్ణ, రాఘవేంద్ర, శివ, అమర్నాథ్, షఫీఉల్లా, భార్గవి, విక్టోరియా రాణి, రాకేశ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం.. ప్రమాదకరం: ఎంపీడీఓ


దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శకుంతల

ముదిగుబ్బ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడడం ప్రాణాంతకమని ఎంపీడీఓ శకుంతల అన్నారు. శుక్రవారం మలకవేముల క్రాస్‌లో ఆమె పర్యటించారు. జనరల్ స్టోర్, టీస్టాల్, ఇతర దుకాణాల వద్దకు వెళ్లి ఈగవర్నెన్స్ మనమిత్ర వాట్సాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని తద్వారా ప్రభుత్వ సేవలు ఇంటివద్ద నుంచి పొందవచ్చని వివరించారు. టీస్టాల్, జనరల్ స్టోర్, ఇతర దుకాణాలలోనూ ప్లాస్టిక్ టీ కప్పులను, పేపర్‌లను, కవర్లను వినియోగించరాదని సూచించారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, టీడీపీ నాయకులు, బండి మల్లికార్జున, తోలేటి ఆదినారాయణరెడ్డి, అబ్దుల్ రషీద్, మాదాసు గంగాద్రి, సూరి, రాజు, శివయ్య, కబీర్ బాషా పాల్గొన్నారు.

20 గొర్రెల అపహరణ

నల్లమాడ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటకుంటపల్లి గ్రామానికి చెందిన సీవీ రంగారెడ్డి తన ఇంటివద్ద ఉన్న గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి అపహరించినట్లు తెలిపారు. శుక్రవారం బాధితుడు తెలిపిన మేరకు నివాసం వద్ద షెడ్ ఏర్పాట చేసి, అందులో 80 గొర్రెలను మేపుతున్నట్లు తెలిపారు. షెడ్‌కు రెండుగేట్లు ఉండగా, రెండు తాళాలు పగులగొట్టి 20గొర్రెలను అపహరించినట్లు తెలిపారు. సమీపంలో ఉన్న ఎస్సీకాలనీ వ్యక్తి బహిర్భూమికి రావడంతో గమనించి కేకలు వేయగా, ఆ వ్యక్తిపై సోడాసీసాలు, కూల్‌డ్రింక్ బాటిల్స్ విసిరి భయపెట్టినట్లు తెలిపారు. బొలేరో వాహనంలో 20 గొర్రెలతో నల్లమాడ, రెడ్డిపల్లి మీదుగా తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

మహారాష్ట్ర ముఖ్యమంత్రికి ఘన స్వాగతం


మహారాష్ట్ర సీఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ

పుట్టపర్తి టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు శుక్రవారం ఉదయం పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు బీజేపీ నాయకులు, జిల్లా అధికారులు ఘనస్వాగతం పలికారు. నెహ్రూ యువ కేంద్రం జాతీయ వైస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, కలెక్టర్ శ్యాంప్రసాద్, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎస్పీ సతీష్‌కుమార్ సీఎంకు పుష్పగుచ్ఛంతో ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం ప్రశాంతి నిలయం చేరుకున్న సీఎం సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఏర్పాటు చేసి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అనుమతిలేని లే అవుట్లపై కఠిన చర్యలు


అనుమతులు లేని లే అవుట్లను చదును చేయిస్తున్న ఎంపీడీఓ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కదిరి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో అనుమతిలేని లేఅవుట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ పోలప్ప హెచ్చరించారు. శుక్రవారం రాత్రికి రాత్రే అక్రమ లేఅవుట్లు అన్న కథ నం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఎంపీడీఓ శుక్రవారం మండలంలోని సున్నంపుగుట్ట తండాలో సర్వే నం బర్ 178లో వేసిన అక్రమ లేఅవుట్లును తొలగించారు. ప్లాట్లకు వేసిన పునాది రాళ్లను ఎక్స్‌కవేటర్‌తో చదును చేయించారు. ఆయ న మాట్లాడుతూ అనుమతి లేకుండా లేఅవుట్లు ఎవరు వేసినా, చర్యలు తప్పవని హెచ్చరించారు. అందులో ప్లాట్లను అమ్మడం చట్ట విరుద్ధమన్నారు. అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయరాదన్నారు. ఆయనతోపాటు పంచాయతీ కార్యదర్శి రామమోహన్, వీఆర్‌ఓ ఓబులేసు, సర్వేయర్లు ఉన్నారు.

ఆటో బోల్తా.. దంపతులకు గాయాలు

ముదిగుబ్బ, నవంబరు, 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొరిగల్లు ఘాట్ రోడ్డులో ఆటో బోల్తాపడి భార్యాభర్తలకు గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుందని 108 సిబ్బంది తెలిపారు. కడప జిల్లా వేంపల్లికి చెందిన బాబాఫకృద్దీన్, మహబూబ్‌జాన్ ఆటోలో వేంపల్లి నుంచి ముదిగుబ్బ వైపునకు వస్తుండగా దొరిగల్లు ఘాట్ రోడ్డులోకి రాగానే ఆటో అదుపు తప్పి బోల్తా పడిందని, ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను కడప జిల్లా పులివెందులలోని ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఈఎంటీ మల్లేష్, పైలెట్ నారాయణస్వామి నాయక్ తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

ధర్మవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గూడ్స్‌షెడ్ కొట్టాలలో ఓ మహిళపట్ల అసభ్యంగా ప్రవర్తించిన బండారు గంగయ్యపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. గూడ్స్‌షెడ్ కొట్టాలలో కొండపాకుల షాలిని, ఉదయ్‌కుమార్ నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఉదయ్‌కుమార్ మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఉదయ్‌కుమార్ పక్క ఇంటిలో ఉన్న బండారు గంగయ్య షాలిని చూడడం, వెంటపడటం చేస్తుండేవాడు. ఆమె వయస్సులో పెద్దవాడు అని, పైగా పూజారి అని పట్టించుకోలేదు. భర్త ఉదయ్‌కుమార్ శివమాల ధరించడంతో రాత్రి సమయాల్లో శివాలయంలో పడుకునే వాడు. గురువారం రాత్రి షాలిని, తనపిల్లలతో కలిసి కాంపౌండ్‌లో నిద్రిస్తోంది. రంగయ్య కాంపౌండ్ గేటు తీసి లోపలికి వెళ్లి ఆమెను లేపి అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె అరవగా పక్కనే ఉన్న అత్తసరళ, మామకృష్ణయ్య, మరుదులు నవీన్‌కుమార్, చరణ్ వస్తుండటంతో గమనించిన రంగయ్య అక్కడికి పరారయ్యాడు. శుక్రవారం గంగయ్యపై ఆ మహిళ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మారెప్పగారిపల్లిలో చోరీ

తనకల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలసముద్రం పంచాయతీలో ఉన్న మారెప్పగారిపల్లిలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన అనసూయమ్మ పుట్టిని ల్లు అయిన నల్లచెరువు మండలంలోని గోరంట్లవారిపల్లి వెళ్లిం ది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో చొరబడి బీరువా తాళాలు పగలకొట్టారు. బీరువాలోని 7 గ్రాముల బంగారం, 250 గ్రాముల వెండి, రూ.20 వేలు దోచుకెళ్లారు. విషయాన్ని పక్కంటివారు అనసూయమ్మకు సమాచారం అందించారు. ఆమె వచ్చి ఇంటిని పరిశీలించి, శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించి కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

విధులకు సచివాలయ సిబ్బంది డుమ్మా..!

● ఖాళీ కుర్చీలే దర్శనం.. వెనుదిరిగిన ప్రజలు


వేపరాళ్ల సచివాలయంలో సిబ్బందిలేక ఖాళీగా ఉన్న కుర్చీలు

గాండ్లపెంట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేపరాళ్ల పంచాయతీ సచివాలయంలో శుక్రవారం విధులకు డుమ్మా కొట్టారు. సిబ్బంది రాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఇక్కడ 9 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఏ ఒక్కరూ సచివాలయంలో లేకపోవడం, వివిధ సమస్యలపైన వచ్చిన ప్రజలు వెనుతిరిగినట్లు తెలిసింది. సచివాలయంలో వివిధ శాఖల అధికారులు ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన వారు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఉద్యోగులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగులు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియ పరిస్థితి. కార్యాలయంలో విలువైన రికార్డులను, కంప్యూటర్‌లను వదిలేసి ఎక్కడికి వెళ్లారోనని పలువురు చర్చించుకుంటున్నారు. సచివాలయంలో విధులు నిర్వహించే అధికారులు సర్వేల పేరుతో సాకులు చెప్పి విధులకు డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం హాజరు పట్టికలో కూడా 12 గంటలు అయినా ఒకరో, ఇద్దరో సంతకాలు చేశారు కానీ మిగిలిన వారు ఇటువైపు కన్నెత్తి చూసినట్లు లేదని తెలుస్తోంది. దీనిపై ఎంపీడీఓ రామకృష్ణను ఫోన్‌లో సంప్రదించగా సిబ్బంది ఎక్కడికి వెళ్లారో తెలుసుకుంటానని సమాధానమిచ్చారు.


సచివాలయ ఉద్యోగుల హాజరు పట్టిక

విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ రాజీలేని పోరాటం

ధర్మవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించే ఏకైక సంఘం ఎస్ఎఫ్ఐ అని టూటౌన్ సీఐ రెడ్డప్ప, సంఘం జిల్లాకార్యదర్శి నాగార్జున అన్నారు. శుక్రవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను సీఐ చేతులమీదుగా ఆవిష్కరించారు. సీఐ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల కోసం నిరంతరం తోడుగా అండగా నిలవాలని సూచించారు. నాగార్జున మాట్లాడుతూ 25వ రాష్ట్ర మహాసభలు తిరుపతిలో 12, 13, 14తేదీలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మహాసభలకు 500 మంది ఎంపిక చేసిన ప్రతినిధులు పాల్గొంటారన్నారు. కూటమి ప్రభుత్వం నేటికీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలన్నారు. సంక్షేమహాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని, మెస్ చార్జీలు పెంచాలని కోరారు. బుక్కపట్నం మండలంలో అర్ధంతరంగా నిలిచిపోయిన ప్రభుత్వ డిగ్రీకళాశాల నిర్మాణం పూర్తిచేయాలన్నారు. జిల్లా కేంద్రంలో సత్యసాయి యూనివర్సిటీ ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేశారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అమన్, శ్రీనాథ్, యూనస్, అఖిల్, ప్రణీత్‌కృష్ణ, రవి పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న సీఐ రెడ్డప్ప, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

మంత్రి సవిత



క్లస్టర్ ఇన్‌చార్జిలతో మంత్రి సవిత

పెనుకొండ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మంత్రి సవిత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జిలను మంత్రి క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త, నాయకుడు ప్రజలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు సమగ్రంగా వివరించి అందుతున్నాయా లేదా తెలుసుకోవాలన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైసీపీ సోషల్ మీడియా తప్పుడు ప్రచారాలను నిరంతరం తిప్పి కొట్టాలన్నారు.

నిధులు కేటాయించండి

సోమందేపల్లి గ్రామంలో ఉన్న ఈద్గా కాంపౌండ్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని మంత్రి సవితను ముస్లింలు కోరారు. తప్పకుండా మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

మడకశిర టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించడమే లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. కొన్ని సమస్యలపై అప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతూ తక్షణం పరిష్కారం చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించడం కోసం అన్ని చర్యలు చేపడుతున్నామని అన్నారు.

4న లక్ష దీపోత్సవం

మడకశిరటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హేమావతి హెంజేరు సిద్దేశ్వరస్వామి దేవాలయంలో డిసెంబరు 4వతేదీన లక్షదీపోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, ఆలయ కమిటీ సభ్యులు లక్ష దీపోత్సవ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. పోస్టర్ల ఆవిష్కరణలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి, మండల కన్వీనర్ నాగరాజు, రామచంద్రప్ప, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్

పెనుకొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్లోబుల్‌జెన్ పాఠశాలలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముఖి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి ఎంకె నబి తెలిపారు. మండల స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి ఒక్కొక్కటీమ్ జిల్లాస్థాయి పరీక్షలకు హాజరవుతారన్నారు. విజేతలకు బహుమతులు, హాజరైన ప్రతి విద్యార్థికి ప్రశంసాపత్రాలు అందజేస్తారన్నారు. జిల్లాస్థాయి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఒక్కో జట్టును మాత్రమే రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్‌తోపాటు జేవీవీ కార్యకర్తలు హాజరవుతారన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న జాన్‌రెడ్డెప్ప

గోరంట్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉర్దూ ఉన్నతపాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. మైనార్టీ సెంటర్‌ఫార్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ స్టడీ మెటీరియల్‌ను పెనుకొండ డిప్యూటీ ఈఓ జాన్‌రెడ్డెప్ప విద్యార్థులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టడీమెటీరియల్ బహుళ ప్రయోజనకరంగా ఉందన్నారు. దీన్ని ఉపయోగించుకుని విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మావతి, ఉపాధ్యాయులు ఫైరోజ్‌అహమ్మద్, ప్రతిభాభారతి, మసీవుల్లా, మహబూబ్, బాషాఆర్ఫీఅలీ, రుబీనా, అల్లాబక్షం, పీడీ రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

పరిగి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దివ్య చారిటబుల్‌ట్రస్ట్ నిర్వాహకుడు పరిగి వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో గర్భిణులకు అన్నదానం చేశారు. ప్రతి శుక్రవారం అన్నదానం చేయడం సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు నవీన, సిబ్బంది పాల్గొన్నారు.

'పాంచజన్య'లో ఉచిత వైద్యశిబిరం

హిందూపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం ముఖ్యమన్నారు. ప్రతి యేడాది పాఠశాలలో అనుభవజ్ఞులైన వైద్యుల సహకారంతో పదోతరగతి విద్యార్థులకు, పాఠశాల సిబ్బందికి ఉచిత వైద్యం అందిస్తామన్నారు. వారికి ఉచితంగా మందులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జక్క నరేంద్ర, రష్మీ, కరిష్మ, కరస్పాండెంట్ నందకుమార్, హెచ్ఎం గాయిత్రి, ఏఓ భాస్కర్, శశికళ పాల్గొన్నారు.



పాఠశాల సిబ్బందికి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చెరువు మట్టి అక్రమ తరలింపు

ట్రాక్టర్లలో తరలిస్తూ రూ.లక్షలు దోపిడీ

చోద్యం చూస్తున్న అధికారులు



చెరువులో ఏర్పడ్డ గుంతలు

సోమందేపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువుల నుంచి కొందరు మట్టిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మట్టిని తరలించుకోవడమే ఉపాధిమార్గంగా ఎంచుకుని చెరువులను గుల్లచేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఇరిగేషన్‌శాఖ, రెవెన్యూ, పోలీస్‌శాఖలు, రాయల్టీ అధికారులు ఈ తంతుపై చోద్యం చూస్తున్నారు. అడ్డుకోబోయిన అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు తేవడంతో వారు చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం. సోమందేపల్లి చేనేత పరిశ్రమకు పుట్టినిల్లు. ఈ పరిశ్రమ ద్వారా అన్నిరంగాల ప్రజలకు ఉపాధి దొరుకుతోంది. పట్టణంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. దీంతో గృహాల బేస్‌మెంట్ కోసం గుంతలు పూడ్చడానికి, వాణిజ్య సముదాయాల భూములు, లేఅవుట్లు చదును చేయడానికి మట్టికి విపరీతమైన డిమాండ్ ఉంది. అదేవిధంగా రెస్టారెంట్లు, కేఫ్‌లు ఇబ్బడి ముబ్బడిగా వెలుస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో వందలాది ట్రాక్టర్ల మట్టి అవసరం ఉంటుంది. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు స్వార్థపరులు మట్టిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టరు లోడు రూ.550 నుంచి రూ.700 వరకు డిమాండునుబట్టి ధర నిర్ణయిస్తూ పట్టపగలే బహిరంగంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. లక్షల రూపాయలు అక్రమార్జనతో పొట్టనింపుకుంటున్నారు. కొత్తపల్లి చెరువు ఈ అక్రమార్కులకు వేదికగా మారింది. పాలకులే కాకుండా బయటి వ్యక్తులు సైతం చెరువుల్లో చొరబడి మట్టి దోపిడీకి పాల్పడుతున్నారు. చెరువు మట్టిని తమ వ్యవసాయ పొలాలను సారవంతం చేసుకోవడానికి పర్మిషన్ తీసుకుని తరలించుకోవడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. ఇరిగేషన్ శాఖ అధికారులు అవసరమైన రైతులకు చెరువును సందర్శించి లోతు, పొడవును నిర్ధారించి క్యూబిక్ మీటర్లమేర తీసుకెళ్లడానికి అనుమతిస్తుంది. అయితే ఇక్కడ విరుద్ధంగా జరుగుతోంది. ఏకంగా 15 నుంచి 20 అడుగుల మేర చెరువులో గుంతలు ఏర్పడ్డాయి. చెరువు స్వరూపాన్ని మార్చేసి సొమ్ము చేసుకుంటున్నారు. శుక్రవారం కొత్తపల్లి చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న జేసీబీ అధికారులను తహసీల్దార్ మారుతి స్థానికులు అందించిన సమాచారం మేరకు అడ్డుకున్నారు. సిబ్బందిని సంఘటనా స్థలానికి తరలించి మట్టిని తరలించకుండా నిలుపుదల చేయించారు. అనుమతిలేకుండా చెరువు మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించామన్నారు. అనంతరం ఇరిగేషన్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

మట్టి తరలింపును అడ్డుకున్న ఇరిగేషన్ అధికారులు

పెనుకొండ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ధనార్జనే ధ్యేయంగా అనుమతులు లేకుండా అక్రమంగా చెరువు నుంచి మట్టి తరలిస్తున్న పనులను ఇరిగేషన్ అధికారులు అడ్డుకున్నారు. పెనుకొండ పట్టణ సమీపంలోని కొండ రోడ్డుకు వెళ్లే రహదారిలో తిరంగనాయనిచెరువులో శుక్రవారం ఎక్స్‌కావేటర్, ఏడు ట్రాక్టర్లు పెట్టి అక్రమంగా మట్టి తరలిస్తున్న సమాచారంతో ఇరిగేషన్ డీఈ రమణారెడ్డి సిబ్బందిని పంపి అడ్డగించారు. పనులను ఆపి వెళ్లిపోవాలని హెచ్చరించారు. అయితే ఒక్కో ట్రాక్టర్ రూ.వెయ్యిచొప్పున ఇటుక భట్టీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని అధికారుల విచారణలో తెలిసింది. ఈ సందర్భంగా ఇరిగేషన్ డీఈ రమణారెడ్డిని వివరణ కోరగా అనధికారికంగా చెరువులో మట్టి తరలిస్తే వాహనాలు సీజ్ చేయించి క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా చెరువు మట్టి వ్యవసాయ పొలాలకు తరలించుకోవచ్చని, అయితే నిబంధనల మేరకు అనుమతులు తీసుకోవాలన్నారు. అలాకాకుండా ఇటుకలభట్టీలకు వ్యాపార సముదాయాలకు తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా చెరువు మట్టి తరలిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

నిరుపయోగంగా మార్కెట్‌యార్డు

పండించిన పంటలను హిందూపురం, కర్ణాటకలో విక్రయిస్తున్న రైతులు

స్థానికంగా మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాలని వినతి



మడకశిరలోని మార్కెట్ యార్డు

మడకశిర రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో ఉన్న మార్కెట్ యార్డు ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంది. దానిని వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు. వ్యాపారాలు జరిగేలా చూడాలని, రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించి అమ్ముకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని సూచిస్తున్నారు. 35 ఎళ్ల క్రితం మడకశిర పట్టణ సమీపంలో 5.50 ఎకరాల్లో మార్కెట్ యార్డును నిర్మించారు. కొన్ని సంవత్సరాలు వినియోగంలో ఉంది. తరువాత నిరుపయోగంగా తయారైంది. యార్డులో గోదాములు లేకపోవడంతో వ్యాపారులు మార్కెట్‌యార్డును వినియోగించేందుకు ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో గత టీడీపీ పాలనలో గోదాములు నిర్మించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం ఏర్పడింది. రైతులు పండించే పంటలను మార్కెట్‌యార్డుకు తీసుకువస్తే మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామని నాయకులు ఆర్భాటంగా ప్రకటనలు చేశారే తప్ప చేసిందేమీలేదని రైతులు అంటున్నారు. ఐదేళ్లలో ఏమాత్రం పట్టించుకోలేదని మాటలకే పరిమితమయ్యారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో చింత, మిరప, మొక్కజొన్న, రాగి, వక్క, మల్బరీ పంటలను రైతులు అధికంగా పండిస్తున్నారు. మార్కెట్ యార్డు నిరుపయోగంగా ఉండటంతో పండించిన పంటలను వ్యయప్రయాసలకోర్చి హిందూపురం, కర్ణాటకలోని తుమకూరు, మధుగిరి, చిత్రదుర్గలలోని మార్కెట్ యార్డులకు తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో మార్కెట్‌యార్డును వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. తమకు స్థానికంగా మార్కెట్‌సౌకర్యం కల్పించాలని అంటున్నారు.

రైతులు మోసపోతున్నారు



స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో రైతులు పండించిన పంటలను హిందూపురం, కర్ణాటకకు వ్యయప్రయాసలకోర్చి తీసుకెళ్తున్నారు. అయితే దీనిని దళారులు అదునుగా భావించి మోసం చేస్తున్నారు. దీంతో పంట దిగుబడులు బాగున్నా రైతులు నష్టపోవాల్సి వస్తోంది. స్థానికంగా ఉన్న మార్కెట్ యార్డులోనే అన్ని పంటలు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

- యోగీశ్వరులు, సీ కొడిగేపల్లి

అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం



రైతులు పండించే పంటలు ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నాం. స్థానిక మార్కెట్ యార్డులోనే అమ్ముకునే విధంగా తగు చర్యలు చేపడుతున్నాం. అందుకోసం చర్యలు జరుగుతున్నాయి. త్వరలో మార్కెట్‌యార్డును అన్నివిధాలా వినియోగంలోకి తీసుకువచ్చి రైతులకు మెరుగైన సేవలు అందిస్తాం.

- గురుమూర్తి, మార్కెట్ యార్డు చైర్మన్, మడకశిర

ఆడిటోరియంలో మధ్యాహ్న భోజనాలు

ఆంధ్రజ్యోతికి స్పందన



ఆడిటోరియంలో భోజనం చేస్తున్న విద్యార్థులు

సోమందేపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సంబంధించి మధ్యాహ్న భోజనాన్ని ఆడిటోరియంలో ఏర్పాటు చేశారు. మధ్యాహ్న భోజన నిర్వహణ, అమలుతీరుపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'విద్యార్థులకు సౌకర్యాలపై పర్యవేక్షణ ఏదీ' అన్న శీర్షిక ప్రచురితమైంది. దుమ్ము ధూళిమధ్య విద్యార్థులు భోజనాలు, కుక్కల స్వైరవిహారం అంటూ వాస్తవాలను కళ్లకు కట్టింది ఆంధ్రజ్యోతి. దీంతో వెంటనే కూటమి నాయకులు, విద్యాశాఖాధికారులు స్పందించారు. శుక్రవారం పాఠశాల ఆవరణంలో ఎస్ఎల్ఎపి కంపెనీ వారు టీఆర్ఎస్ ఫండ్ ద్వారా నిర్మించిన నూతన ఆడిటోరియం భవనాన్ని తెరిపించారు. కంపెనీ ప్రతినిధులను కలిసి వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, సిద్దలింగప్ప, చాకర్లపల్లి శ్రీరాములు మాట్లాడారు. వారిని పాఠశాలకు పిలిపించి పరిస్థితిపై సమీక్షించారు. వృథాగా ఉన్న ఆడిటోరియం భవనాన్ని విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు ఉపయోగించుకునేలా విద్యాశాఖాధికారులు, నాయకులు చర్చించారు. ఈ క్రమంలో పంచాయతీ కార్మికులు ఆఘమేఘాలతో భవనాన్ని శుభ్రం చేయించారు. దగ్గరుండి మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులచే ఆడిటోరియంలో చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ మంత్రి సవిత ఆదేశాలతో ఏర్పాట్లు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆంజనేయులునాయక్, ఇన్‌చార్జి హెచ్ఎం రామాంజినేయులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుడు పోతులమూర్తి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

దొంగల స్వైరవిహారం

ఒక్క కేసు కూడా ఛేదించని పోలీసులు

పట్టణవాసుల ఆగ్రహం

24న బంద్‌కు పిలుపు



సీసీ ఫుటేజ్‌లో రికార్డ్ అయిన దృశ్యం

పావగడ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దొంగతనాలు అధికమయ్యాయి. పోలీసుల వైఫల్యంతోనే దొంగలు చెలరేగుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వారం టీచర్స్ కాలనీలోని రిటైర్డ్ టీచర్ శంకరప్ప ఇంట్లో దొంగలు చొరబడి అతడిని కొట్టి రూ.40లక్షలు ఎత్తుకెళ్లారు. ఆ సంఘటన మరువకముందే కురుబ వీధిలోని ఓబులమ్మ ఇంట్లో రూ.2లక్షలను దొంగలు ఎత్తుకెళ్లారు. ప్రభుత్వ ఆసుపత్రి వెనుకాల ఉన్న ఒంటరి మహిళ ఇంట్లో చొరబడి రూ. లక్ష దొంగలించారు. బుధవారం కరియమ్మన పాళ్య గ్రామంలో దొంగలు చొరబడి బంగారాన్ని దోచుకెళ్లారు. శుక్రవారం ఉదయం పావగడ కొత్త బస్టాండులో ఉన్న గుర్రప్ప లేఅవుట్‌లో మూడు హోల్‌సేల్ దుకాణాల్లో దొంగలు వరుసగా దోపిడీ చేశారు. అశ్విని మార్కెటింగ్‌లోని పైకప్పు కోసి లోపలికి ప్రవేశించిన దొంగలు రూ.2లక్షల వరకు దొంగలించారు. హోల్‌సేల్ దుకాణంలోకి ప్రవేశించి అక్కడ రూ.60వేలు , ఆ పక్కనే ఉన్న మరో దుకాణంలో ప్రవేశించి ఏమీ దొరకకపోవడంతో వెళ్లిపోయినట్లు సీసీ ఫొటేజ్‌లో కనిపించింది. ఇన్ని సంఘటనలు జరుగుతున్నా, ఇన్ని ఫిర్యాదు అందుతున్నా పోలీసులు మాత్రం తమకుపట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

24న బంద్

పావగడలో ఇటీవల విచ్చలవిడిగా దొంగతనాలు జరుగుతుంటే ఒక్క కేసు కూడా ఛేదించకపోవడం దారుణమని సీనియర్ సిటిజన్లు, పలు స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు అన్నారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ సీఐ సురేష్ అసమర్థత వల్లే దొంగలు విచ్చలవిడిగా దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం పావగడ బంద్ చేస్తున్నట్లు వారు పిలుపునిచ్చారు.

ఒడిశా గవర్నర్‌కు స్వాగతం

చిలమత్తూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో పాల్గొనేందుకు బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన శుక్రవారం పుట్టపర్తికి వెళుతున్న ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబుకు డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథం స్వాగతం పలికారు. కొడికొండ చెక్‌పోస్టులోని రక్షా అకాడమీలో కొంత సమయం విశ్రాంతి తీసుకున్న సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. కొంత సమయం తరువాత గవర్నర్ అక్కడ నుంచి పుట్టపర్తికి వెళ్లారు.



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న జగన్నాథం

మౌలిక సదుపాయాలపై ఆరా

అగళి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బీసీ హాస్టల్‌ను శుక్రవారం అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి గంగాధర్, ఎంఈఓ కృష్ణమూర్తిరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, విద్యా విషయాలు, భోజన వసతులు, మౌళిక సదుపాయాలపై ఆరాతీశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులతో తెలుసుకున్నారు. అదేవిధంగా టెన్త్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం బీసీ వెల్ఫేర్ అధికారి మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం అనేక వసతులు కల్పించిందని వాటిని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డన్ సికిందర్‌బాష, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

25 నుంచి శిక్షణ తరగతులు

అగళి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడంపై ఈనెల 25నుంచి 28వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ గంగాధర్ తెలిపారు. అగళి ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణా తరగతులు ఉంటాయని 25న పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఉప సర్పంచులు, 26న మహిళా సంఘం సభ్యులు, వీఓఏలు ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఇద్దరు మహిళా సంఘ సభ్యులు, 28న ఎంఆర్‌సీలు, గ్రీన్‌అంబాసిడర్లుకు ఉదయం 9.30నుంచి సాయంత్రం 5గంటల వరకు జరగనున్న శిక్షణలో పాల్గొనాలన్నారు.

టీడీపీ అనుబంధ కమిటీ ఎంపిక

మడకశిరటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ 17 అనుబంధ కమిటీలను శుక్రవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో అధిష్ఠానం ఆదేశాల మేరకు ప్రకటించారు. బీసీ సెల్ అధ్యక్షులుగా మారుతీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎన్.గిరి, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులుగా మారుతీప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా నంజుండప్ప, మహిళా అధ్యక్షురాలిగా మంజుళ, ప్రధాన కార్యదర్శిగా సుజాతమ్మ, ఎస్టీ సెల్ అధ్యక్షులుగా సిద్దేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణానాయక్, మైనారిటీ సెల్ అధ్యక్షులుగా ఎస్.నజీర్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా ఖాసీంసాబ్, తెలుగుయువత అధ్యక్షులుగా అశ్వర్థనారాయణ, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్ ఎంపికయ్యారు. టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులుగా లోకేష్, ప్రధాన కార్యదర్శిగా నరసింహమూర్తి, టీఎన్‌టీయూసీ అధ్యక్షులుగా రఘురాం, ప్రధాన కార్యదర్శిగా ఉమేష్, కల్చరల్ అధ్యక్షులుగా రాజన్న, ప్రధాన కార్యదర్శిగా కృష్ణమూర్తి, లీగల్ సెల్ అధ్యక్షులుగా కృష్ణమూర్తి, లీగల్‌సెల్ ప్రధానకార్యదర్శిగా రంగనాథ్ పేర్లను ప్రకటించారు. వికలాంగుల సంఘం అధ్యక్షులుగా రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రంగా, డాక్టర్ సెల్ అధ్యక్షులుగా సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా నాగభూషణ్, రైతు సంఘం అధ్యక్షులుగా రంగనాథ్, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున్, ట్రేడర్స్ సంఘం అధ్యక్షులుగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా ప్రసన్నకుమార్‌లను ఎంపికచేశారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రొద్దం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో జరుగుతున్న స్కూల్‌గేమ్స్‌లో సాఫ్ట్‌బాల్ పోటీల్లో తురకలాపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు చైతన్, రామ్, రాకేష్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. పులివెందులలో నవంబరు 22, 23, 24న తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయని, అందులో పాల్గొంటారని హెచ్ఎం వెంగప్ప, పీడీ రామక్రిష్ణ తెలిపారు.

'క్రీడలతోనే మానసిక ఉల్లాసం'

పెనుకొండ/ రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం సాధ్యమని ఎంఈఓలు రాఘవయ్య, సుధాకర్ అన్నారు. పట్టణంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులతో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఈ సందర్భంగా ఎంఈఓలు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇదో మంచి అవకాశమన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అరుణ పాల్గొన్నారు.

వెండి పల్లకిలో రంగనాథుడి ఊరేగింపు

రొళ్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) మండలంలోని కాలువపల్లి గ్రామంలో వెలసిన రంగనాథస్వామిని వెండిపల్లకిలో భక్తులు శుక్రవారం ఊరేగించారు. ఈ సందర్భంగా ఉదయంనుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఊరేగింపు జరిగింది. ఊరేగింపులో భక్తులు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు గ్రామసభ

అమరాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు. కార్యక్రమానికి అన్ని గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు హాజరు కావాలన్నారు. జాబ్‌కార్డులలో చాలా రోజులుగా పనికి హాజరుకాని వారు, వలస వెళ్లిన కుటుంబాలకు చెందినవారిని శాశ్వతంగా తొలగించనున్నట్లు తెలిపారు.